ప్రజాశక్తి

బుధవారం 14 డిసెంబరు 2022 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

ప్రకృతి వైపరీత్యం...ప్రభుత్వ నిర్లక్ష్యం

- డ్రైన్లు, కాల్వల్లో కదలని నీరు
- పొలాలను వదలని ముంపు
- పెరుగుతున్న పంట నష్టం

పొలాల్లో నిలిచిన నీరు; మొలకలు వస్తున్న ధాన్యం, తడిసిన పంటను చూపుతున్న రైతులు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

ప్రకృతి వైపరీత్యానికితోడు ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులను నిండా ముంచుతోంది. డెల్టా ప్రాంతంలోని డ్రైన్లకు మరమ్మతులు చేయడంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. దీంతో వర్షం పూడిన కాల్వలు, డ్రైన్లలో నుండి ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. రోజుల తరబడి పొలాల్లోనే నిలబడి పోవడంతో నష్టం పెరిగిపోతోందని రైతులు వాపోతున్నారు. మాండూస్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షం నీటిని పొలాల్లో నుంచి తొలగించడం ద్వారా ముంపుకు గురైన వరి పంట నష్టాన్ని తగ్గించుకోవాలని జిల్లా అధికార యంత్రాంగం రైతులకు చేస్తున్న సూచనలు ఆచరణలో సాధ్యం కావడం లేదు. దివిసీమ ప్రాంతంలో రత్నకోడు, న్యూ ఇరాలీ డ్రైన్, కోడూరు ఔట్‌ఫాల్ స్లూయిజ్, సాగకాలువ, గుండేరు, భీమనది, బందరు ప్రాంతంలో శివగంగ, తాళ్లపాలెం, పెదన, బంటుమిల్లి ప్రాంతాల్లో లజ్జబండ డ్రైన్లు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. అధిక వర్షాలు కురిసిన సమయంలో గ్రామాలు, పంట పొలాల్లోని నీరు ఈ డ్రైన్ల ద్వారా ప్రవహించి నేరుగా సముద్రంలో కలుస్తుంది. పోటు సమయంలో సముద్రపు నీరు డ్రైన్లలోకి చొచ్చుకురాకుండా, ఎగువ నుంచి వచ్చే వర్షం నీరు నిల్వ లేకుండా సముద్రంలో కలిసేలా కొన్ని ఆటోమేటిక్ షటర్లు, అవుట్‌ఫాల్ స్లూయిజ్లు డ్రైన్లు ఏర్పాటై ఉన్నాయి. వీటికి అనుసంధానమై గ్రామ, మండల స్థాయిల్లో వేల కిలోమీటర్ల మేర మైనర్ డ్రయిన్లు విస్తరించి ఉన్నాయి. అయితే గత కొన్నేళ్లుగా ఈ డ్రైన్లలో పూడిక తీయడానికి, షటర్లు,అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల మరమ్మతులకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయించలేదు. అవుట్‌ఫాల్ స్లూయిజ్లు, షట్టర్లు సరైన పద్ధతిలో పనిచేయడం లేదు. ఎగువ నుంచి వచ్చిన నీరు సముద్రంలోకి వెళ్లకుండా డ్రైన్లలో ఎగదన్ని పొలాలను ముంచుతోంది. ఈదురుగాలులకు నేలకొరిగిన వరి, కోతలు పూర్తయిన పనలపైన నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండటంతో మొలకలు వచ్చి నష్టం పెరుగుతోంది.

వైసిపి కార్పొరేటర్ దందా

- సచివాలయ ఉద్యోగాలిప్పిస్తానని నిరుద్యోగులకు ఎర
- 20 మంది నుండి రూ.30 లక్షల వరకు వసూలు
- కారు డ్రైవర్ ద్వారా వ్యవహారం
- నేరం మీదేసుకోవాలని డ్రైవర్‌పై దాడి, బెదిరింపులు

దెబ్బలకు వాచిపోయిన తన ఎడమ చేయి మణికట్టును పోలీస్‌స్టేషన్ వద్ద చూపుతున్న కారు డ్రైవర్ రమేష్

ప్రజాశక్తి - విజయవాడ : సచివాలయ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశ చూపి అధికార వైసిపికి చెందిన ఓ కార్పొరేటర్ లక్షలాది రూపాయలు వసూలు చేసిన వ్యవహారం పోలీస్టేషన్‌కు చేరింది. ఈ వ్యవహారం నగరంలో పెద్ద చర్చనీయాంశమైంది. తెలిసిన సమాచారం ప్రకారం..అధికార వైసిపికి చెందిన వన్‌టౌన్ 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్, అతని అనుచరులు కలిసి సచివాలయాల్లో శాశ్వత ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి సుమారు 20 మంది వద్ద నుండి సుమారు రూ.30 లక్షలకు పైగా డబ్బులు వసూలు చేశారు. ఒక్కొక్కరి వద్ద రూ.1 లక్ష నుండి రూ.1.50 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. తన కారు డ్రైవర్ ఉప్పలపాటి రమేష్ ద్వారా డబ్బులు వసూలు చేయించినట్లు తెలిసింది. ఈవ్యవహారంలో మధురానగర్‌కు చెందిన ఐదుగురు వద్ద నుంచి రూ.4.50 లక్షలు, అలాగే ఆర్‌ఆర్‌పేట, కండ్రిక, కేదారేశ్వరపేట తదితర ప్రాంతాల్లోని నిరుద్యోగుల వద్ద గత కొంతకాలం నుండి లక్షలాది రూపాయలు వసూలు చేసినట్లు తెలిసింది. అయితే ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో ఇటీవల బాధితులు ఒక్కొక్కరు బయటకు వచ్చి కార్పొరేటర్‌ను, ఆయన కారు డ్రైవర్‌ను నిలదీసినట్లు తెలిసింది. ముఖ్యంగా డబ్బులు తీసుకున్న కారు డ్రైవర్ రమేష్‌పై వత్తిడి (మిగతా 6లో)

మరో స్పా సెంటర్‌పై దాడులు

- పటమటలో కె స్టుడియో స్పా సెంటర్ గుట్టురట్టు
- మసాజ్ ముసుగులో వ్యభిచార దందా
- మారువేషంలో పోలీసుల సెర్చ్ ఆపరేషన్

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

గత రెండు మాసాలుగా విజయవాడ నగరంలో స్పా సెంటర్లు, మసాజ్ ప్యార్లర్లు, హోటళ్లు, లాడ్జీలపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఒక పక్క పోలీసులు ఉక్కు పాదం మోపుతున్నా మరో పక్క ముఠాలు స్పా సెంటర్‌లలో యథేచ్ఛగా చీకటి కార్యకలాపాలు కొనసాగిస్తూనే ఉన్నారు. మసాజ్ ముసుగులో హైటెక్ వ్యభిచారం నిర్వహిస్తూనే ఉన్నారు. తాజాగా మంగళవారం నగరంలోని స్పా సెంటర్‌పై పోలీసులు దాడి నిర్వహించారు. స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారంతో విజయవాడ నగరంలోని పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో గురునానక్ కాలనీలో ఉన్న కే స్టూడియో స్పా సెంటర్‌పై పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. మసాజ్ పేరుతో అక్కడ వ్యభిచారం జరుగుతున్నట్టు గుర్తించారు. ఈ దాడులలో మొత్తం ఎనిమిది మంది వ్యభిచారం చేస్తున్న మహిళలతో పాటు ముగ్గురు విటులు కూడా పట్టుబడ్డారు. పోలీసులు చేపట్టిన ఈ సెర్చ్ ఆపరేషన్‌లో నివ్వెరపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. విటుల వేషంలో ఇక్కడ వ్యభిచారం జరుగుతుందని తొలుత పోలీసులకు సమాచారం అందింది. అయితే అక్కడ జరుగుతున్న గుట్టు రట్టు చేసేందుకు వినూత్న ఆలోచన చేశారు. పోలీసు యూనిఫాంలో కాకుండా మారు వేషంలో వెళ్లాలని భావించారు. విటుడి వేషంలో వెళ్తే పూర్తి స్థాయి సమాచారం రాబట్టొచ్చని ప్లాన్ చేశారు. ఇలా మారువేషంలో స్పా కు వెళ్లి అమ్మాయిల కోసం బేరసారాలు చేశారు. నిజమైన కస్టమర్‌లేనని పోలీసుల ట్రాప్‌లో పడిన నిర్వాహకులు అన్ని విషయాలు వివరిస్తూ కస్టమర్లకు ఇస్తున్న ఆఫర్లు (మిగతా 6లో)

ధాన్యం రవాణాలో అవస్థలు

- సరిపడా అందుబాటులోలేని వాహనాలు
- కిరాయిలు గిట్టుబాటుకావడంలేదంటున్న వాహనదారులు

ప్రజాశక్తి - గన్నవరం : ధాన్యం కొనుగోలు ప్రక్రియలో నిబంధనలతో ఓపక్క రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, మరోపక్క రవాణా విషయంలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. సరిపడా వాహనాలను సమకూర్చలేకపోవడంతోపాటు సాంకేతికంగా ఎదురవుతున్న ఇక్కట్లను పరిష్కరించడంలో అధికారులు శ్రద్ధ వహించడం లేదన్న విమర్శలు విన్పిస్తున్నాయి. గుత్తేదార్లతో కుదిరిన ఒప్పందం ప్రకారం 0–8 కిలో మీటర్ల వరకు టన్నుకు రూ.280, ఆ తర్వాత ప్రతి కిలోమీటరుకు రూ.6 నుంచి రూ.6.50 చొప్పున కిరాయి చెల్లిస్తారు. గుత్తేదారైనా, అతని ద్వారా వాహనాలు పెట్టిన ప్రైవేటు ఆపరేటర్లయినా అన్ని ఖర్చులూ ఈ మొత్తంలోనే సరిపెట్టాల్సి ఉంది. డీజిల్ ధర, డ్రైవర్ల వేతనాలు లెక్కచూసుకుంటే గిట్టుబాటు కావడం లేదన్నది వాహనదారుల వాదనగా ఉంది. పైగా కొన్నిచోట్ల దిగుమతి కూలీ సైతం ఇందులోనే మినహాయిస్తున్నారని వాపోతున్నారు. పొరుగునే ఉన్న ఏలూరు జిల్లాలో టన్నుకు రూ.370 చొప్పున లారీ కిరాయి ఇస్తుంటే, ఇక్కడ రూ.90 తక్కువగా నిర్ణయించారని విమర్శస్తున్నారు. ఇంకోపక్క రవాణా చేసిన వెంటనే కిరాయిలు ఇవ్వకపోవడం, వారాల తరబడి పెండింగ్ పెట్టడంతో గుత్తేదారులు సైతం ముందస్తు పెట్టుబడి పెట్టలేక చేతులెత్తేస్తున్నారు. ప్రైవేటు వాహనదారులు కూడా ఒకట్రెండు కిరాయిలకు వెళ్లి ఇక తమ వల్ల కాదంటూ వెనుదిరుగుతున్నారు.

ఆది నుండీ గందరగోళమే

కొనుగోలు చేసిన ధాన్యాన్ని పొలం నుంచి మిల్లుకు చేర్చేందుకు అవసరమైన రవాణా సదుపాయం గురించి పూర్తి స్పష్టత లేకుండానే కొనుగోలు కేంద్రాలు (మిగతా 6లో)

జగ్గయ్యపేట మార్కెట్ యార్డులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, చిరుమామిళ్ల హనుమంతరావు తదితరులు

షరతుల్లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఎటువంటి షరతులు లేకుండా వెంటనే కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో ఆరబోసిన ధాన్యాన్ని మంగళవారం సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేటకు చెందిన రైతులు, కౌలు రైతులు మాట్లాడుతూ తాము గత పది రోజుల నుండి ధాన్యాన్ని మార్కెట్ యార్డ్‌లో ఆరబెట్టడం, కుప్పలేసి పరదా పట్టాలు కప్పడం వంటివి చేస్తున్నామని, అయినా తేమ శాతం ఎక్కువగా ఉందని చెప్పి తమ ధాన్యాన్ని కొనకుండా అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. ఎకరానికి 40 బస్తాల ధాన్యం పండిందని, 25 బస్తాలు మాత్రమే కొంటే మిగిలిన ధాన్యం ఎక్కడ అమ్ముకోవాలో తమకు అర్థం కావడం లేదని వాపోయారు. తేమశాతం (మిగతా 6లో)

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలి

వెహికల్ డిపో వర్కర్స్ యూనియన్ మహాసభలో బాబూరావు

ప్రజాశక్తి-విజయవాడ: వెహికల్ డిపోలోని ఉద్యోగ, కార్మికులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని, లేకపోతే ఐక్యంగా ఉద్యమించాల్సి వస్తోందని సిఐటియు రాష్ట్ర నాయకులు చిగురుపాటి బాబూరావు హెచ్చరించారు. వెహికల్ డిపో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మహాసభ మంగళవారం డిపోలో జరిగింది. ముందుగా డిపో యూనియన్ అధ్యక్షులు బి.నాగేశ్వరరావు యూనియన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల కాలంలో మృతిచెందిన కార్మికులకు మహాసభ సంతాపం తెలిపింది. మహాసభనుద్దేశించి బాబూరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులను పర్మినెంట్ చేస్తామని ఈ ప్రభుత్వం గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అమలు చేయడంలో వైఫల్యం చెందిందన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న కాంట్రాక్టర్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులను క్రమంగా తొలగించే పనికి ఈ ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గమన్నారు. వెహికల్ డిపోలోని చెత్త తరలించే డ్రైవర్లు, క్లీనర్లకు, కార్మికులకు కూడా హెల్త్ అలవెన్స్ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు రిస్క్ అలవెన్స్‌ను అమలు చేయాలని కోరారు. ఐడి కార్డులు, ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. ఎంప్లాయిస్‌కు మంజూరు చేస్తున్నట్లుగానే కాంట్రాక్ట్ కార్మికులకు కూడా గృహాలను మంజూరు చేయాలని కోరారు. వెహికల్ డిపో వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ వెహికల్ డిపోలో కనీసమైన మౌలిక సదుపాయాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దశాబ్దాల తరబడి పని చేస్తున్నా ఎటువంటి ప్రమోషన్లు లేవన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఐక్యంగా ఉద్యమించాల్సి వస్తోందన్నారు. అనంతరం వెహికల్ డిపో యూనియన్ నూతన కమిటీ 21 మందితో ఏర్పడింది. కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా కొండా హరిబాబు, ధనికొండ వెంకటేశ్వరరావు, కోశాధికారిగా బి.నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.జ్యోతిబస్, ఎం.డేవిడ్, కోశాధికారి డి.స్టీఫెన్‌బాబు, సీఐటీయూ నాయకులు టి.ప్రవీణ్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో వేగంగా గృహ నిర్మాణాలు : ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి-చందర్లపాడు: జగనన్న కాలనీల్లో వేగంగా గృహ నిర్మాణాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక

జగన్‌మోహన్‌రావు అన్నారు. చందర్లపాడు గ్రామంలోని జగనన్న కాలనీలో నూతనంగా ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారుని గృహప్రవేశ వేడుకలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రభుత్వం ఉచితంగా ఇళ్ల స్థలాల పట్టాలను అందజేయడమే కాకుండా ఆయా స్థలాలలో వారు సొంత ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం తరపున రూ.1.80 లక్షలు ఆర్థిక సహాయం కూడా అందజేస్తున్నట్లు తెలిపారు. జగనన్న కాలనీలు కొత్త ఊర్లను తలపిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కస్తాల పున్నమ్మ, జడ్పిటిసి ముక్కపాటి నరసింహారావు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావు, యార్లగడ్డ సత్యనారాయణ ప్రసాద్, మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, ఎంపీటీసీ మౌలాలి, లాల్ సా తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ పట్టణ పరిధిలో మంగళవారం 19వ వార్డు హనుమంతుపాలెంలో మున్సిపల్ కమిషనర్ ఎస్. జయరాం పర్యటించారు. వార్డులో ప్రత్యేక పారిశుధ్య పనులు చేయించారు. వార్డులోని ప్రధాన రక్షిత మంచినీటి ట్యాంక్‌ను పరిశీలించి క్లోరిన్ టెస్ట్‌లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మందా మరియమ్మ పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ ఆర్ఎస్ గార్డెన్లో గ్రాండ్ సెమి క్రిస్మస్ వేడుకలు మంగళవారం నిర్వహించారు. విజయవాడ పార్లమెంటు టిడిపి నాయకులు కేశినేని చిన్ని, నందిగామ మాజీ ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య ముఖ్య అతిథిగా పాల్గొని సెమి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. నందిగామ నియోజక వర్గ స్థాయిలో సుమారు వెయ్యి మంది పాస్టర్స్‌కు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిడిఎంఎం ఇంజనీరింగ్ కాలేజి అధినేత డా.జి.వి.ప్రసాదరావు, పాస్టర్ల సంఘం నాయకులు వర్ల మోహనరావు, టిడిపి మండల అధ్యక్షులు వీరంకి వీరాస్వామి పాల్గొన్నారు.

పటమటలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న సిఐటియు నాయకులు

'సిఐటియు మహాసభను జయప్రదం చేయండి'

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఈ నెల 15, 16 తేదీలలో విజయవాడలో జరిగే సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జగ్గయ్యపేట మండల అధ్యక్ష కార్యదర్శులు సుధారాణి, షేక్ గౌస్ మియా, నాయకులు ఎస్ రామనాథం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 15వ తేదీ ఉదయం పది గంటలకు విజయవాడ పంజా సెంటర్ నుండి ప్రదర్శన, జెండా చెట్టు సెంటర్లో సభ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నరసింగరావు, జిల్లా ఉపాధ్యక్షులు డివి కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ పాల్గొంటారని తెలిపారు. **ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా 11వ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ కృష్ణా జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పటమట ఈ సేవా కేంద్రం వద్ద సిఐటియు జెండా ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక నాయకులు యల్లారావు జెండాను ఆవిష్కరించారు. అనంతరం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వి.బి.రాజు మాట్లాడుతూ 15వ తేదీన వన్‌టౌన్ పంజాజెంటర్ వద్ద కార్మికుల ర్యాలీ ఉంటుందని ఈకార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైఖరి వలన భవన నిర్మాణ కార్మికుల భవిష్యత్తు అంధకారంలో ఉందని కార్మికుల భవిష్యత్తు గురించి మహాసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో తూర్పు నగర కార్యదర్శి బి.బెనర్జీ, కోశాధికారి ఏడుకొండలు, 14వ డివిజన్ శాఖ కార్యదర్శి బి.రవీంద్ర, నగర నాయకులు వి.గురుమూర్తి, పి.రాజు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

జిల్లా ఉపాధి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్ఇడిఎపి సంయుక్త ఆధ్వర్యంలో 14వ తేదీ బుధవారం నగరంలోని జిల్లా ఉపాధి కార్యాలయం నందు ' జాబ్ మేళ ' నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి డాక్టర్ పి.వి. రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ విజయవాడసంస్థకు సంబంధించి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, డిజైనర్స్, సాఫ్టువేర్ ప్రోగ్రామర్స్, ఆపరేటర్స్, ఫీడర్స్, హెల్పర్స్‌కు సంబంధించిన ఖాళీలను ఈజాబ్‌మేళా నందు భర్తీ చేయనున్నారని తెలిపారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్‌కు సంబంధించి ఇంటర్, డిగ్రీ చదివిన అభ్యర్థులు, డిజైనర్స్ పోస్టులకు సంబంధించి ఇంటర్ విద్యార్హతతో పాటు పేజ్ మేకర్, ఫోటోషాప్‌లో అనుభవం ఉండాలన్నారు. సాఫ్టువేర్ ప్రోగ్రామర్స్‌కు డిగ్రీ, లేదా పిజి విద్యార్హతతో పాటు డేటా బేస్, పిహెచ్‌పి, ఎస్‌క్యూఎల్ సర్వర్‌లో తెలిసిఉండాలన్నారు. ఆపరేటర్స్, ఫీడర్స్, హెల్పర్స్‌కు సంబంధించి ఐటిఐ, పాలిటెక్నిక్, విద్యార్హత కలిగిన వారు హాజరుకావచ్చని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్ జిరాక్సు కాపీలతో పాటు అడ్రస్‌ప్రూఫ్, ఆధార్ కార్డు కాపీలతో ఈనెల 14వ తేదీన ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఆవరణలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో హాజరుకావకాలన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎటువంటి టిఎ, డిఎ ఇవ్వబడదని తెలిపారు.

విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: విద్యార్థుల్లో పుస్తక పఠనం అలవర్చుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్, సమగ్ర శిక్షా పథక సంచాలకులు సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం విజయవాడలోని కేబీసీ బాయ్స్ హైస్కూల్ ప్రాంగణంలో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ బుక్ ట్రస్ట్ నిర్వహిస్తున్న 'ఎన్‌బిటి కృష్ణా పుస్తక పరిక్రమ' సంచార పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణా తీరంలో ఉన్న పాఠశాలలు, విద్యార్థులు 'కృష్ణా పుస్తక పరిక్రమ'ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విజయవాడ నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రల గుండా దాదాపు 45 రోజుల పాటు సాగే ఈ పరిక్రమ పుస్తక ప్రియులకు గొప్ప వరమన్నారు. కార్యక్రమ సమన్వయకర్త నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా తెలుగు సంపాదకులు, దక్షిణ ప్రాంత ఆఫీసర్ ఇంచార్జ్ డాక్టర్ పత్తిపాక మోహన్ మాట్లాడుతూ కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా దేశ వ్యాప్తంగా పుస్తక సంస్కృతి వ్యాప్తి కోసం పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా రాష్ట్ర అదనపు పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు, ప్రముఖ బాలసాహితీవేత్త ముంజులూరి కృష్ణకుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుని సరోజినీ భర్త మృతి

ప్రజాశక్తి-గంపలగూడెం: మండలంలోని గోసవీడు గ్రామ ఎంపీ యూపీ పాఠశాల ఉపాధ్యాయిని కూరపాటి దేవసరోజిని భర్త సత్య వర్ధన్‌ప్రసాద్ (65) మంగళవారం తెల్లవారుజామున మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సత్య వర్ధన ప్రసాద్ తెలంగాణలో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందారు. ప్రసాద్ భౌతికకాయాన్ని జిల్లా డిపిఆర్‌టియు అధ్యక్షులు బూరుగు జమలయ్య, మూడు మండలాల ఉపాధ్యాయ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు కుంభగిరి రాంబాబు, పిఆర్‌టియు మండల అధ్యక్ష కార్యదర్శులు మేరుగు జయశీలన్ రావు, అట్లూరి సుధాకర్‌రెడ్డి, డిపిఆర్‌టియు అధ్యక్ష కార్యదర్శులు నల్లగొండ నరసింహారావు, ఏవి నరసింహారావు, యుటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు చిల్లపల్లి రమేష్, కుంభగిరి మోహన్ రావు, పూర్వ కార్యదర్శులు బిజె సుందర్ రావు, కూరపాటి రత్నకుమార్ సందర్శించి నివాళులర్పించారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-వన్‌టౌన్: తన పుట్టిన రోజుకు కొత్త బట్టలు కొనలేదని మనస్థాపానికి గురై ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వించిపేటలో ఉంటున్న పఠాన్ సలాం ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుంటారు. కుమారుడు పఠాన్ గాలిబ్ షెయిద్ (21) ఫ్రైజర్‌పేటలో చికెన్ షాపులో పనిచేస్తుంటాడు. మంగళవారం గాలిబ్ పుట్టినరోజు కావడంతో బట్టలు కొనేందుకు డబ్బులు ఇవ్వాలని అడిగాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్థాపానికి గురై తల్లిదండ్రులు బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లోని ఐరన్ మెష్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టుటౌన్ పోలీసులు సలాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

ఫ్లైఓవర్ కింద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 35 నుండి 40 సంవత్సరాల వయసు ఉండి ఒంటిపై నిండు కాఫీ పొడి రంగు చొక్కా, బ్లూ కలర్ జీన్ ఫ్యాంట్ కలిగి ఉన్నాడు. కొంతకాలంగా చుట్టపక్కలే తిరుగుతున్నట్లు సమాచారం. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని స్థానిక చెరువు బజార్, డంగు మిల్లు రోడ్డు, కబెలా వెనుక పరిసర ప్రాంతాలలో రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం యువ నాయకులు సామినేని వెంకటకృష్ణప్రసాద్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ 14వ ఆర్థిక సంఘం ప్రత్యేక నిధులతో పనులు జరుగుతున్నాయని, శంకుస్థాపన చేసిన ప్రతిచోట పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు ఆకుల బాజీ, యువజన విభాగం అధ్యక్షులు ఆవాల భవానీప్రసాద్, బీసీ సెల్ గుంజ లక్ష్మణ్, కౌన్సిలర్లు సాదుపాటి రాజు, కర్ల శాంత కుమారి, ఇర్రి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్లను ఆదర్శంగా తీసుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కంచికచర్ల: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన నిధులతో అభివద్ధి పనులు పూర్తి చేయడంలో కంచికచర్ల గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. జిల్లాలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన నిధులతో మొదటగా కంచికచర్లలో చేపట్టిన పనులు పూర్తి కావటంతో మంగళవారం కలెక్టర్ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 45 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. ఇందుకు 41 కోట్ల రూపాయలతో చేపట్టిన 321 పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కంచికచర్లను మోడల్‌గా చూపించి, మిగతా సచివాలయాల పరిధిలో కూడా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో రవీంద్రరావు, పంచాయతీ రాజ్ ఈఈ ఎ.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ వి.రాజకుమారి, ఎంపీడీవో కె.బాలశంకరరావు, ఏఈ రవికుమార్, సర్పంచ్ వేల్పుల సునీత, ఉప సర్పంచ్ వేమా సురేష్‌బాబు, కార్యదర్శి కనగాల రవికుమార్, వైసిపి నాయకులు వేల్పుల శ్రీనివాసరావు పాల్గొన్నారు. కంచికచర్ల మండలంలో మండల పరిషత్ నిధులతో చేపట్టే అభివద్ధి పనులకు గ్రామ పంచాయతీ పాలకవర్గం తీర్మానాలు ఇవ్వడంలేదని ఎంపిపి షేక్ మలక్ బషీర్, వైసిపి నాయకులు తంగెళ్లమూడీ రామారావు చేసిన ఫిర్యాదుపై కలెక్టర్ స్పందిస్తూ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కషి చేస్తానన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన టిడిపి బృందం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

టిడిపి అగ్రికల్చర్ స్క్రీనింగ్ కమిటీ బృందం సభ్యులు మండలంలోని అంగలూరు గ్రామంలో మంగళవారం పర్యటించారు. పంట పొలాల్లోని వరి పనలు, పలు గ్రామాల్లో రోడ్ల వెంబడి ఆరబోస్తున్న ధాన్యపు రాశులను స్క్రీనింగ్ కమిటీ సభ్యులతో కలిసి

మొలకొచ్చిన ధాన్యపు గింజలను పరిశీలిస్తున్న బుద్ధప్రసాద్

మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పరిశీలించారు. కమిటీ సభ్యుల వద్ద, రైతాంగం తమ సమస్యల గోడు వెళ్లబోసుకున్నారు. ఆర్‌బికె కేంద్రాలు, మిల్లర్లు కుమ్మక్కై రైతులను చెడుగుడు ఆడుకుంటున్నారని మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణరావు మండిపడ్డారు. తల్లిదండ్రుల్లా ఆదుకోవాల్సిన ప్రభుత్వం శని గ్రహంలా మారి రైతులను కష్టాల పాల్జేస్తుందని అగ్రికల్చర్ స్క్రీనింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం జగన్‌కు రైతుల కష్టాలు ఏం తెలుస్తాయని రావి వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించిన రైతాంగ సమస్యల నివేదికను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేస్తామని స్క్రీనింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. టిడిపి అగ్రికల్చరల్ స్క్రీనింగ్ కమిటీ పర్యటనలో పలువురు రైతు సంఘం నాయకులు, టిడిపి నేతలు పాల్గొన్నారు. **పమిడిముక్కల** : తుపాన్‌లో పంటల నష్టపోయిన బాధిత రైతులను పూర్తిస్థాయిలో ఆదుకోవాలని మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ల నారాయణరావు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. పమిడిముక్కల మండలంలోని చోరగుడిలో మంగళవారరంనాడు చోరగుడి గ్రామంలోని తడిసిన వరి పనలు, ధాన్యపు రాశులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పామర్రు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వర్ల కుమార్ రాజా, తెలుగు రైతు నాయకులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, గోపు సత్యనారాయణ, కొల్లూరుపల్లి గణేష్, నాగేశ్వరావు, కందిమల్ల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. అనంతరం 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా వీరంకిలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో జక్కా శ్రీనివాసరావు, రామారావు, వెంకటసుబ్బయ్య, లక్ష్మీనారాయణ, రాజులపాటి శ్రీనివాసరావు, మర్రివాడ గ్రామ సర్పంచ్ వంపుగడల ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలతోనే ముంపు సమస్యలు

కోడూరు : డ్రేనేజీ వ్యవస్థ సరిగ్గా లేనందుని పంట పొలాలు నీట మునిగాయని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ విమర్శించారు. మంగళవారం కోడూరు మండల పరిధిలోని విశ్వనాథపల్లి, నారేపాలెం, గాబ, పిట్టలంక గ్రామాల్లో మాండోస్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పొలాలను వాటికి అనుసంధానంగా ఉన్న డ్రేనేజీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పంట పొలాలు మునగడానికి డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేనందునేనని పేర్కొన్నారు. దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించటానికి అధికారులు రాకపోవటం

వరి పనలను పరిశీలిస్తున్న కొనకళ్ల, వర్ల తదితరులు

సరికాదన్నారు. డ్రేనేజీ సరిగా లేనందున ఆయిల్ ఇంజన్లతో వేల రూపాయలు వ్యయం చేసి నీరు బయటకు తోడుకోవాల్సి వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఉప సభాపతి మాట్లాడుతూ పంట పొలాలు ఇలా నీట మునగటానికి ప్రధాన కారణం డ్రేనేజీ వ్యవస్థ సరిగా లేక పోవటమేనన్నారు. ప్రభుత్వ లెక్కల్లో మాత్రం కోట్ల రూపాయలు డ్రైనేజీ బాగు చేసినందుకు వ్యయం చేసినట్లుగా చూపిస్తున్నారని విరించారు. వీరి వెంట బండే శ్రీనివాసరావు, కాగిత రామారావు, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు ఉన్నారు.

మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ఘంటసాల మాండాస్ తుఫాన్‌తో తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఏపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపి రైతు సంఘం ప్రతినిధి బృందం పలు గ్రామాల్లో మంగళవారంనాడు పర్యటించింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఘంటసాల మండలం లంకపల్లి గ్రామంలో వరి పంట అంతా మునిగిపోయిందని, గ్రామంలో రైతులు రోడ్డు మీద ఆర పోసిన ధాన్యం వానకు తడిసి మొలకెత్తిందన్నారు. కొంతమంది రైతుల పంట కోసి పనల మీదనే ఉండగానే

తడిసిపోవడంతో నూర్పిడి చేసే అవకాశం లేకుండా పోయిందన్నారు. దీంతో ధాన్యం రైతులు తీవ్రంగా నష్టపోయారని సర్వేలో తేలిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు నిబంధనలను సడలించి మద్దతు ధరలకు ప్రకారం మొలకెత్తిన ధాన్యాన్ని, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రతినిధి బందం రాష్ట్ర ప్రభుత్వాన్నికి విజ్ఞప్తి చేసిందన్నారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు పి.జమలయ్య, పి.వెంకన్నబాబు, కె.రామకష్ణ, కె.జగన్మోహనరావు, జి.బ్రహ్మేశ్వరరావు, టి.బసవశంకరరావు, టి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వసతులు వేగవంతం చేయాలి : ఆర్‌డిఒ

అవనిగడ్డ : అవనిగడ్డ మండలంలోని నాలుగు జగనన్న కాలనీల్లో లేఔట్లలో మౌలిక వసతులు వేగవంతం చేయాలని బందరు ఆర్‌డిఒ ఐ.కిషోర్ ఆదేశించారు. మంగళవారం అవనిగడ్డ తహశీల్దార్ కార్యాలయంలో జగనన్న కాలనీల్లో మౌలిక వసతులపై పంచాయతీరాజ్, హౌసింగ్, రెవెన్యూ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నత్తనడకన సాగుతున్న గృహ నిర్మాణాలకు సంబంధించి నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఇంచార్జ్ ఎంపీడీవో పి.శైలజ కుమారి, తహశీల్దార్ రామకృష్ణ, హౌసింగ్ డిఇ జి భానోజీ రావు, పంచాయతీరాజ్ ఏఈ ఎన్ వాసుదేవరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మినుము పంట పరిశీలన

మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మచిలీపట్నంలోని జిల్లా వనరుల కేంద్రం, వ్యవసాయ పరిశోధనాకేంద్రం, సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ సహాయకులు, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. బుద్దాలపాలెం గ్రామంలో మినుము పైరును రైతులతో కలిసి పరిశీలించారు. ఎఆర్ఎస్ శాస్త్రవేత్త గిరిజారాణి, డిఆర్‌సిడి డిఎ జ్యోతి రమణి, సహాయ వ్యవసాయ సంచాలకులు కె.శ్రీనివాస్, మండల వ్యవసాలను అధికారి జి.వి.శివప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎల్.లత్రశ్రీ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఆదాయం పెంచుకోవాలి

గన్నవరం : గ్రామ పంచాయతీల్లో ఆదాయం పెంపుదలకు సర్పంచులు, కార్యదర్శులు ప్రత్యేక కృషి చేయాలని ప్రత్యేక అధికారి బాపూజీ తెలిపారు. గన్నవరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల్లో జిడిపిపై రెండు రోజుల శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. బాపూజీ మాట్లాడుతూ పంచాయతీల్లో ఆదాయం పెంపుదలకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఇంటిపన్నులపై దృష్టి పెట్టాలన్నారు. ఖర్చులకు అనుగుణంగా ఆదాయాలను సమకూర్చుకోవడానికి మార్గాలను అన్వేషించాలని వివరించారు. ప్రభుత్వం ఇస్తున్న నిధులతో పాటు సదుపాయాలను ఉపయోగించుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఆదాయం లేకుంటే ఏ పని చేయడం సాధ్యం కాదని ఆ విషయాన్ని అధికారులు సర్పంచులు గుర్తించాలని తెలిపారు. ఆదాయ మార్గాల పై పూర్తిస్థాయి వివరణ ఇచ్చారు.

పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలి

ప్రజాశక్తి-ఉయ్యూరు

విద్యార్థులను పరిశోధనల వైపు ప్రోత్సహిచడం ద్వారా ఆలోచనా సరళిని పెంపొందించొచ్చునని ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ కె.రామమోహనరావు అన్నారు. ఏజీ అండ్ ఎస్‌జిఎస్ కళాశాల ఐక్యూఏసీ, పరిశోధనా శాస్త్ర విభాగం, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మంగళవారం పరిశోధనా ప్రాముఖ్యత, పరిశోధనా పద్ధతులపై అవగాహనకు అధ్యాపకులు, విద్యార్థులకు వర్క్‌షాపు నిర్వహించారు. రామమోహనరావు ముఖ్య అతిథిగా మాట్లాడారు. పరిశోధనా క్లిష్టమైన ఆలోచనా సరళిని మార్పుతుందన్నారు. సమస్య గుర్తించి విశ్లేషించి దానికి పరిష్కార మార్గం తెలుసుకునేందుకు ఉపయోగ పడుతుందన్నారు. పరిశోధనా రంగంవైపు ఆసక్తి పెంపొందించటానికి పరిశోధనా పత్రాలు చదివి పద్ధతులను తెలుసుకోవాలన్నారు. నూతన విద్యావిధానంలో పరిశోధనా శాస్త్రానికి అత్యంత ప్రాముఖ్యత ఇచ్చారని వివరించారు. స్టార్టప్, పరిశోధనా పద్ధతుల మధ్య సంబంధాన్ని కృష్ణా విశ్వవిద్యాలయ అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.వీరబ్రహ్మచారి వివరించారు. వర్క్‌షాపు రిసోర్సెస్ పర్సన్లు తుమ్మల చంద్రశేఖర్, జయశంకర్ ప్రసాద్, రాజేశ్ సి.జంపాల పరిశోధన ప్రాముఖ్యతను తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ, రీసెర్చి కమిటీ కన్వీనర్ వి.శ్రీరామ్, ఐక్యూఏసీ కో- ఆర్డినేటర్ జి.గిరిప్రసాద్, కళా శాల అధ్యాపకులు పాల్గొన్నారు.

గెలుపు రథసారథులు కావాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ

వచ్చే ఎన్నికల్లో 175 సీట్లలో గెలుపే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం మేరకు నూతనంగా నియమించనున్న గ్రామ సారథులు రాబోయే ఎన్నికల్లో గెలుపు రథసారథులు కావాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు సూచించారు. మంగళవారం అవనిగడ్డ పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ తుంగల సుమతి దేవి, అవనిగడ్డ, కోడూరు, నాగాలంక జడ్పిటిసిలు చింతలపూడి లక్ష్మీనారాయణ, యాదవరెడ్డి సత్యనారాయణ, మోకా బుచ్చిబాబు, నియోజకవర్గం అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండల పార్టీ అధ్యక్షులు రేపల్లె శ్రీనివాసరావు, పరిసే మాధవరావు, భోగాది శేషగిరిరావు, ముద్దినేని చంద్రరావు, ఉపాధి మౌలిక వసతుల కల్పన సంస్థ డైరెక్టర్ మద్దె చిన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నం మండలం చిన్నాపురం గ్రామంలో ఇంజనీరింగ్ ఫైనల్ విద్యార్థి చలమలశెట్టి సాయి ప్రసాద్(20) విద్యుత్ షాక్ తో మరణించాడు. సెమీ క్రిస్మస్ వేడుకల సందర్భంగా చిన్నాపురంలో ని ఒక చర్చిలో డెకరేషన్ చేస్తూండగా సోమవారం రాత్రి ప్రమాద వశాత్తు విద్యుత్ వైర్లు తగలడంతో మరణించాడు. చలమలశెట్టి శ్రీనివాసరావు పెద్ద కుమారుడైన సాయి ప్రసాద్ విజయవాడ ధనేకుల ఇంజనీరింగ్ కాలేజీలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. మృతదేహానికి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పంచనామా నిర్వహించారు. రూరల్ ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హౌసింగ్ బోర్డు కాలనీలో చోరీ

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

స్థానిక హౌసింగ్ బోర్డులోని సాయి శ్రీనివాసా ఎంటర్ ప్రైజస్‌లో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎంటర్ ప్రైజస్ పైన ఉన్న గోడౌన్ తాళాలు పగుల కొట్టి చోరీకి పాల్పడ్డారు. క్యాష్ కౌంటర్లో ఉన్న సుమారు రూ.90 వేలు నగదును దోచుకెళ్లారు. విషయం తెలుసుకున్న చిలకలపూడి సిఐ రాజశేఖర్ తన సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకుని విచారణ ప్రారంభించారు. క్లూస్ టీమ్, సీసీఎస్ పోలీసులు ఆధారాలు సేకరించారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

దళిత ద్రోహి జగన్ : రావి

గుడివాడ : దళితులకు చెందిన 27 సంక్షేమ పథకాలు రద్దు చేసిన దళిత ద్రోహి జగన్ అని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు విమర్శించారు. ఇటీవల పోలీసులు అరెస్టు చేసిన మహిళలు అనిలేటి నిర్మల, సునీత, రాణి, రోజలను రాష్ట్ర ఎస్సీ నాయకులు పరామర్శించారు. అనంతరం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాష్ట్ర ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు దొప్పలపూడి జ్యోతిబసుతో కలిసి రావి మాట్లాడారు. ఎస్సి నాయకులు కర్రా సుధాకం, కొండా ప్రవీణ్ కుమార్, బి.బాలాజీ, టిడిపి రూరల్ అధ్యక్షులు వాసే మురళి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలివ్వాలి : సిఐటియు

గన్నవరం : ఉంగుటూరు మండలం పెద్ద అవుటపల్లి పంచాయతీలో కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయానికి వచ్చిన ఎంపీడీవో శేషగిరిరావుకి వినతి పత్రం అందించారు. పంచాయతీలో 21 మంది కార్మికులు పనిచేస్తూ ఉండగా వారిలో కొంతమందికి మూడు నెలలు, మరికొంతమందికి ఎనిమిది నెలలు వేతనాలు పెండింగ్ పడ్డాయని సిఐటియు మండల కార్యదర్శి కడవకొల్లు రామరాజు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గతంలో ఇక్కడ కార్యదర్శిగా పనిచేసిన అధికారిని అడిగితే కార్మికుల అటెండెన్స్‌లో తేడాలు ఉన్నాయని అందుకే తాను జీతాలు ఇవ్వలేదని ఆమె తెగేసి చెప్పినట్లుగా తెలిపారు. సర్పంచి ముగ్గురు వేతనాలను తన ఖాతాలో వేసుకుంటున్నట్లుగా చెప్పినట్లుగా అధికారి తెలిపారు. వేతనాలను ఇప్పటికైనా ఇవ్వకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. దీనిపై ఎంపీడీవో శేషగిరిరావు స్పందిస్తూ వారం రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్మికుల వేతనాల సమస్యను వెంటనే పరిష్కరించాలని కార్యదర్శి అప్పారావును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ సంఘం అధ్యక్షులు వడ్డాది లక్ష్మి, కార్యదర్శి బంగారు రాజు, నెంబర్ రామారావు, రమాదేవి, జోష్ పిన్ను తదితరులు పాల్గొన్నారు.

రవళి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి నాగాయలంక

అవనిగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు కోడలు, యువ నాయకులు సింహాద్రి వికాస్ సతీమణి రవళి పుట్టినరోజును పురస్కరించుకుని నాగాయలంకలోని వృద్ధాశ్రమంలో 25 కేజీల బియ్యం, కూరగాయలు, ఫ్రూట్స్ వికాస్ అన్న ఫ్రెండ్స్ సర్కిల్ (గరికిపాటి రాకేష్, సింహాద్రి చరణ్, సింహాద్రి చైతన్య) ఆధ్వర్యంలో పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో చాడిశెట్టి రామాంజనేయులు, రేమాల బాలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : రక్షణనిధి

ప్రజాశక్తి-ఎ.కొండూరు: పార్టీలకతీతంగా అర్హత కలిగిన ప్రతిఒక్క పేదవాడికి సంక్షేమ పథకాలు అందిస్తూ పేదరిక నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మంగళవారం మండలంలోని కంభంపాడు గ్రామ సచివాలయ-2 పరిధిలోని అట్లప్రకడ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే అధికారులతో మాట్లాడి సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, చెన్నారావు, జడ్పీటీసీ భూక్యాగనియా, వైస్ ఎంపీపీ గుంటక శివారెడ్డి, సర్పంచ్ కోట పుల్లమ్మ, ఎంపీటీసీ కోట పుల్లారావు, వైసిపి రాష్ట్ర నాయకులు నరెడ్ల వీరారెడ్డి, వైసీపీ మండల సీనియర్ నాయకులు వజ్రాల బ్రహ్మానందరెడ్డి, తిరువూరు ఏఎంసి ఛైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, వైసిపి జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు గోగులమూడి చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-భవానీపురం: స్థానిక 45వ డివిజన్ జోజినగర్ వద్ద భాష్యం స్కూల్ ప్రక్క రోడ్డును సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు మంగళవారం 45వ డివిజన్ వైసీపీ నాయకులు మైలవరపు కృష్ణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డును రూ.9.90 లక్షల వ్యయంతో నిర్మించనున్నట్లు వివరించారు. డివిజన్ అభివృద్ధికి కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్య విశేషంగా కృషిచేస్తున్నారని అన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-గంపలగూడెం: మండలంలో ఎన్టీఆర్ జిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.సునీత మంగళవారం పర్యటించారు. కనుమూరు, అనుములంక, వాసవీడు గ్రామాల్లో పర్యటించి జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కనుమూరులో పంటచేలకు వెళ్లి ఛానల్ పనులను, అనుమలంకలో పండ్ల తోటలను పరిశీలించారు. గోసవీడిలో చెత్త నుండి సంపాదన తయారు చేయు కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వైపీ రెడ్డి, ఏపీవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

సర్వేశ్వరరావుకు నివాళి

ప్రజాశక్తి-తిరువూరు: పాత తిరువూరులో సోమవారం మృతిచెందిన సిపిఎం సీనియర్ కార్యకర్త జాదం సర్వేశ్వరరావు భౌతికకాయాన్ని ఆ పార్టీ నాయకులు సానికొమ్ము నాగేశ్వరరెడ్డి, గుళ్లపల్లి వెంకటరత్నం, ఎస్వీ భద్రం, చప్పిడి సురేష్, ఎం.ప్రభాకరరావు, ఎస్.వెంకటేశ్వర్లు, బి.వెంకటేశ్వరరావు, యండ్రాతి సత్యనారాయణ, కె.వి.రత్నం, ఐద్వా జిల్లా నాయకురాలు ఎస్.కుమారి మంగళవారం సందర్శించి నివాళు లర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, బంధువులు, కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రదీప్‌కు సన్మానం

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు అక్షర జూనియర్ కళాశాలలో బైపిసి చదివిన విస్సంపల్లి ప్రదీప్ ఎంబిబిఎస్ సీటు సాధించినందుకు మంగళవారం కళాశాలలో డైరెక్టర్ దనుంజయ, అధ్యాపకులు ఘనంగా సన్మానించి భినందించారు. విశాఖప ట్నంలోని గాయత్రి మెడికల్ కళాశాల లో ఎంబి బిఎస్ సీటు సాధించిన ప్రదీ ప్ తమ కళాశాలలో 2018-2020 విద్యా సంవత్సరంలో బైపిసిలో తిరువూ రు పట్టణ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించి పట్టుదలతో నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుని ఈ విద్యా సంవత్సరం ఎ కేటగిరిలో ఎంబిబిఎస్ సీటు సాధించటం గర్వంగా ఉందని ధనుంజయ తెలిపారు.

క్రీడాకారులకు చేయూత

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: విజయవాడ పట్టణంలో ఇటీవలే జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలో మొదటి స్థానంలో గెలుపొంది జోనఖ-2 టోర్నమెంట్‌కు అర్హత సాధించిన జగ్గయ్యపేట నియోజకవర్గం కబడ్డీ టీం సభ్యులు మంగళవారం మాజీ శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ కబడ్డీ క్రీడాకారులకు కావలసిన స్పోర్ట్స్ కిట్ నిమిత్తం పదివేల రూపాయల నగదును వారికి అందజేసి వారిని ప్రోత్సహించారు.

భవానీ దీక్షల విరమణకు ముమ్మర ఏర్పాట్లు

ప్రజాశక్తి-వన్‌టౌన్: రాష్ట్రంలోనే తిరుమల తిరుపతి దేవస్థానం తర్వాత అతి పెద్ద రెండవ దేవాలయంగా పేరుగాంచిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి శ్రీ అమ్మవారి భవాని దీక్ష విరమణ మహోత్సవాలు ఈనెల 15 నుండి 19వ తేదీ వరకూ అత్యంత వైభవోపేతంగా జరుగుతాయి. ఈ సందర్భంగా మన రాష్ట్రం నుండే గాక ఇతర రాష్ట్రాల నుండి ప్రాంతాలనుండి పెద్ద సంఖ్యలో విచ్చేయు భవానీ భక్తుల కోసం దేవాలయ అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. స్వాగత ద్వారాలు ఏర్పాటుచేశారు. భవానీ దీక్షల మాల విరమణకు వచ్చే భవానీలు దుర్గగుడి నుండి గిరి ప్రదక్షిణ ప్రారంభించి కుమ్మరిపాలెం, విద్యాధరపురం, కబేళా రోడ్డు మీదుగా మిల్క్ ప్రాజెక్ట్, చిట్టినగర్, బ్రాహ్మణ వీధి గుండా గిరిప్రదక్షిణ చేసి, అమ్మవారి మొక్కులు తీర్చుకునే ఆచారం. ఈ నేపథ్యంలో వచ్చే భవానీ భక్తుల కోసం దుర్గగుడి అధికారులతో పాటు రెవెన్యూ, విఎంసి, పోలీస్ ఇలా పలు శాఖల సమన్వయంతో భవానీ దీక్షల విరమణ మహోత్సవాల్లో సహకారం అందిస్తారు. వచ్చే భవానీల కోసం సుమారు 20 లక్షల వరకూ లడ్డూలు సిద్ధం చేసే పనిలో దేవాలయ అధికారులు నిమగ్నమయ్యారు. అలాగే మూడు హోమగుండాలు, పది లడ్డూ కౌంటర్లు కూడా కనకదుర్గా నగర్‌లో సిద్ధం చేశారు. సీతమ్మవారి పాదాల ఘాట్ వద్ద 500, భవానీఘాట్ వద్ద 100, పున్నమిఘాట్ వద్ద 200 బాత్ షవర్లు సిద్ధం చేస్తున్నారు. 15 లక్షల వాటర్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నారు. భవానీలు ఉచిత దర్శన భాగ్యం కల్పించారు. మొత్తం మీద 20 మెడికల్ క్యాంపులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. భవానీ దీక్షల విరమణ ఏర్పాట్లకు 3,500 మంది పోలీసులు సేవలు అందించనున్నారు. భవానీలకు సేవలు అందించేందుకు ఇతర దేవాలయాల నుండి డిప్యూటేషన్‌పై 200 మందిని రప్పిస్తున్నట్లు దుర్గగుడి అధికారులు తెలిపారు. వినాయకుని గుడి వద్ద నుండి భవానీలు క్యూ లైను మార్గం గుండా కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మెట్ల మార్గం ద్వారా హోమగుండాలకు చేరుకుని మొక్కులు తీర్చుకునే సదుపాయం కల్పిస్తున్నారు. దీనికోసం మూడు హోమ గుండాలు, ప్రసాదం కౌంటర్లు, క్యూ లైన్ లు, మొబైల్ టాయిలెట్లు, కేశఖండన, స్నానపు ఘాట్లు మరియు ఇతర ఏర్పాట్లు అన్ని సిద్ధం చేశారు. భవానీలు గిరి ప్రదక్షిణ నేపథ్యంలో చిట్టినగర్ కెటి రోడ్డును సిద్ధం చేస్తున్నారు. అయితే కెటి రోడ్డు ఒకవైపు సిమెంట్ రోడ్డు నిర్మాణం జరగ్గా, మరోవైపు నిర్మాణంలో ఉంది. ఈ నేపథ్యంలో ఉత్సవాల రోజుల్లో పనులను నిలిపివేసి ఆ రోడ్డును కూడా సరిచేసి అందుబాటులో తెచ్చేవిధంగా పనులు చేపట్టారు.

సిద్ధమవుతున్న ప్రసాదం కౌంటర్లు, క్యూలైన్లు

80 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పుట్టగుంట సతీష్‌కుమార్, ఆంధ్ర హాస్పటల్ ఆరోగ్య జ్యోతి కార్యక్రమంలో భాగంగా స్థానిక పుల్లగూర ప్రభాకరరావు క్లినిక్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆంధ్ర హాస్పటల్ వైద్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ అచ్యుత్‌బాబు తదితరులు 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ జెండర్ డాక్టర్ పుల్లగూర ప్రభాకరరావు, క్లబ్ అధ్యక్షులు మంగినేని ఏడుకొండలు, సభ్యులు సూదుల సోమశేఖర్, కాలవ సీతారామాంజనేయులు, పెద్దినేడి కోటేశ్వరరావు, సానె రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పిసిబి సాంకేతికపై పట్టు సాధించాలి

ప్రజాశక్తి-వన్‌టౌన్: ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని మైక్రోలింక్ పెరిఫెరల్ కంట్రోల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వీ. గోవిందరావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో 'పీసీబీ డిజైన్' అంశంపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమం మంగళవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వీ గోవిందరావు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ విభాగంలో పీసీబీ డిజైన్ అంశానికి సంబంధించి చాలా విస్తతమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఎలక్ట్రానిక్ సర్క్యూట్లకు భౌతికరూపమే పీసీబీ అన్నారు. పీసీబీ నమూనా బోర్డుల ద్వారా సిగ్నల్స్ ప్రయాణిస్తాయన్నారు. అలాగే సర్క్యూట్ వివిధ విభాగాల మధ్య సమాచారాన్ని తీసుకెళ్తాయన్నారు. నిత్యం వినియోగించే అనేక ఎలక్ట్రానిక్స్ పరికరాల్లో పీసీబీ పాత్ర చాలా కీలకంగా ఉంటుందన్నారు. విద్యార్థులు పీసీబీ అంశానికి సంబంధించి పూర్తిస్థాయిలో పట్టు సాధించాలన్నారు. అలాగే మారుతున్న కాలానుగుణంగా ఆ రంగంలో వస్తున్న మార్పులను గమనించి వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులను వారివారి రంగాల్లో ప్రోత్సాహించే లక్ష్యంతో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఎల్ రమేష్, డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, విభాగాధిపతి నాగభూషణం, ఎలక్ట్రానిక్స్ విభాగ ఇన్‌ఛార్జి ఆర్ ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని డాంగే నగర్‌లో మంగళవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పాల్గొని వైసీపీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక పరిశ్రమలు లేక చదువు పూర్తి చేసుకున్న నిరుద్యోగులు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నారన్నారు. అన్ని రంగాల్లో విఫలమైన వైసీపీ ప్రభుత్వంపై రాష్ట్రంలోని ప్రజలే ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మైనేని రాధాకృష్ణ, సామినేని మనోహర్, పేరం సైదేశ్వరరావు, మద్రి శ్రీనివాసరావు (కారం శ్రీను), గుర్రం రామారావు, ఏపూరి నాగ శ్రీను పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: కర్లపాటి చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న ఉచిత కటింగ్ అండ్ టైలరింగ్ కుట్టు శిక్షణను వినియోగించుకోవాలని ట్రస్ట్ వ్యవస్థాపకులు, సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రెండు మాసాలపాటు ఉచిత శిక్షణ, సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. వివరాలకు కాకాని నగర్ లోని ట్రస్ట్ కార్యాలయం, ఫోన్ నెంబర్ 9154022922కు సంప్రదించాలని ఆయన సూచించారు.

పాస్టర్లకు గౌరవ వేతనంపై మంత్రికి వినతి

ప్రజాశక్తి-హెల్త్‌యూనివర్శిటీ: పాస్టర్లు అందరికీ గౌరవ వేతనం ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని, చర్చిల నిర్మాణం,రిపేర్లకు సంబంధించి నిబంధనలు సరళీకృతం చేయాలని బిషప్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షులు బిషప్ బాలరాజులు మైనారిటీ శాఖా మంత్రి అంజద్‌భాషాను కలిసి వినతిపత్రం అందచేశారు. నగరంలోని మంత్రి కార్యాలయంలో కలిసిన సందర్భంగా మంత్రికి ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియచేశారు. అలాగే ప్రభుత్వం నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకలను గురించి చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రైస్తవులకు స్మశాన వాటికలు కేటాయించాలని, పాస్టర్లందరికీ గౌరవ వేతనం అందే విధంగా చూడాలని మంత్రిని కోరారు. అలాగే దళిత క్రైస్తవుల సమస్యలను కూడా పరిష్కరించాలన్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలిపారన్నారు.

ఆటో కార్మికుల హక్కుల కోసం పోరాటం : సిఐటియు

ప్రజాశక్తి-విజయవాడ: ఈ నెల 15. 16 తేదీలలో జరిగే సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా మహాసభలను ఆటో వర్కర్స్ పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు సెంట్రల్ సిటీ) ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ మెయిన్ గేటు పార్సిల్ ఆఫీస్ వద్ద ఆటో కార్మికులతో మంగళవారం విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగాఎన్. సి. హెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికుల హక్కుల కోసం, వారి సంక్షేమం కోసం రాజీలేని పోరాటం చేస్తున్న సిఐటియు జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. విజయవాడ నగరంలో ఉన్న ఆటో కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. పోలీసుల వేధింపులు, ట్రాన్స్‌పోర్టు అధికారుల ఫెనాల్టీలు, కేసులతో ఆటో కార్మికుల వృత్తి దెబ్బతినే పరిస్థితికి వచ్చిందన్నారు. పెరిగి డీజిల్, పెట్రోల్ భారంతో ఆటో లను తిప్పడం భారంగా మారిందన్నారు. ప్రభుత్వాల నుంచి ఆటో కార్మికులకు ఎటువంటి సాయం అందడం లేదన్నారు. ఆటో కార్మికుల హక్కుల కోసం, వారి సంక్షేమం కోసం సిఐటియు రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు కార్మికుల ప్రయోజనాల కంటే బడా కంపెనీల యజమానులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల జీవనోపాధిని దెబ్బ కొడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటో, మోటార్ కార్మికులపై 21. నెంబర్ జీవో పేరిట వేలాది రూపాయలు జరిమానాలు విధిస్తూ ఆటో, మోటార్ కార్మికుల జీవనోపాధిని దెబ్బతీస్తుందని అన్నారు. ఆటో మోటార్స్ స్పేర్ పార్ట్స్ ధరలతో పాటు నిత్యవసర వస్తువులు ధరలు విపరీతంగా పెరగటంతో ఆటో మోటార్ కార్మికులకు వచ్చే ఆదాయంలో సగభాగం ఖర్చు చేయవలసి వస్తుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆటో, మోటార్ కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ నెల 15న నగరంలోని పంజా సెంటర్ నుంచి బయలుదేరే మహా ప్రదర్శన జెండా చెట్టు వద్ద జరిగే బహిరంగ సభలో పెద్ద ఎత్తున ఆటో మోటార్ కార్మికుల పాల్గొనాలని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె. దుర్గారావు, ఆటో వర్కర్స్ యూనియన్ నగర నాయకులు ఎం.హనుమంతరావు, ఎస్.కె దుర్గావళి, డి.కోటయ్య, ఎ.నాగబ్రహ్మం, ఆర్.సుబ్బరాజు, పి.తిరుపతయ్య, బి.లక్ష్మణ, జె.సూర్యనారాయణ, బి.వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఆటో కార్మికులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

నిధుల్లేకుండా గ్రామాభివృద్ధి చేసేదెలా?

ఎంపిడిఒను నిలదీసిన సర్పంచ్‌లు : ప్రతిఘటించిన వైసిపి ఎంపిటిసిలు

ప్రజాశక్తి-ఉయ్యూరు

పంచాయతీలకు వచ్చిన నిధులన్నీ ప్రభుత్వం దొంగిలించిందనీ, బ్యాంకు ఖాతాల్లో రూపాయి లేకుండా గ్రామాభివృద్ధి ఎలా చేయాలని ఎంపీడీవోను తెలుగుదేశం పా ర్టీకి చెందిన సర్పంచ్‌లు నిలదీశారు. వైసీపీ ఎంపీటీసీలు అడ్డుతగలడంతో సమావేశం కొద్దిసేపు రసాభస అయ్యింది. ఉయ్యూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ చీలి కల్పన అధ్యక్షతన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ సచివాలయ సిబ్బందితో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక సమావేశం నిర్వహించారు. గ్రామాల అభివృద్ధి-చేపట్టాల్సిన చర్యలను ఎంపీడీవో వివరించారు. జబర్లపూడి సర్పంచ్ సూరపనేని వరప్రసాద్, సాయిపురం సర్పంచ్ జాన్ బాషా, ఆకునూరు సర్పంచ్ వసంత కుమార్ లేచి గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన లక్షల రూపాయల నిధులు రాష్ట్ర ప్రభుత్వం దొంగతనంగా తీసుకుందన్నారు. చేతిలో చిల్లిగవ్వలేకుండా గ్రామంలో అభివృద్ధి పనులు ఎలా చేసేదని ఎంపీడీవో విమాదేవిని ప్రశ్నించారు. దీంతో పెద ఓగిరాలకు చెందిన వైసీపీ ఎంపీటీసీ గుంటక నాగిరెడ్డి, గండిగుంట ఎంపీటీసీ బందెల శ్రీనివాసరావు వారిని అడ్డుకున్నారు. పంచాయతీల నిధులు ప్రభుత్వం లాక్కుందంటారా, ఏమి మాట్లాడుతున్నారు, ప్రణాళిక సమావేశానికి మీరెందుకు వచ్చారని టీడీపీ సర్పంచ్ వైపు దూసుకొచ్చారు. దీంతో ఎంపీడీవో పిలిస్తే వచ్చామనీ, అధికారులను అడిగితే మీరెందుకు మాట్లాడుతున్నారని టీడీపీ సర్పంచ్లు ధీటుగా జవాబిచ్చారు. సమావేశంలో ఇరుగ్రూపుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రసాభాస అవుతున్న నేపథ్యంలో ఎంపీడీవో, ఇతర ఉద్యోగులు కల్పించుకుని ఇరుగ్రూపుల వారికి సర్దిచెప్పారు. నిరసనగా సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్నట్టు ప్రకటించి టీడీపీ సర్పంచ్లు బయటకు వెళ్లిపోయారు.

ఎంపిడిఒ మాట్లాడుతుండగా టిడిపి సర్పంచ్‌ల నిరసన

ధాన్యాన్ని పరిశీలిస్తున్న బచ్చుల అర్జునుడు తదితరులు

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి : అర్జునుడు

ప్రజాశక్తి-గన్నవరం

తుపాన్‌తో తడిసిన పనలు, రంగు మారిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని టిడిపి గన్నవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, శాసనమండలి సభ్యుడు బచ్చుల అర్జునుడు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఉంగుటూరు మండలం మానికొండ గ్రామంలో గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' మంగళవారం జరిగింది. తుఫాన్ ధాటికి తడిసిన పనలు, రంగు మారిన ధాన్యాన్ని రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అర్జునుడు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ రెడ్డి అసమర్థ పాలనతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో ధాన్యం సేకరణను రాష్ట్రవ్యాప్తంగా 37 లక్షల మెట్రిక్ టన్నులకు కుదించగా ఆ ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు క్లస్టర్ ఆరుమళ్ల కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆళ్ల హనుక్, కొండేటి ఏడుకొండలు, రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి, నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి పాతూరి రాజ్ కుమార్, యూనిట్ ఇంచార్జ్ అరికట్ల రవికుమార్, బిఎల్ఎ అబ్దుల్ అజిత్, చిరుమామిళ్ల సూర్యం, ఎడ్లపల్లి సాయి, బెజవాడ నాగేశ్వరరావు, నాగమల్లేశ్వరరావు, కొలుసు రవీంద్ర, ఎస్.కె దాదా, ప్రకాష్, విష్ణువర్ధన్ ,వెంకటేశ్వరరావు, గోవర్ధన్, వీరంకి దామోదర్, దొడ్ల కుమార్, రహీం, పార్వతీశం, కట్టా నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

క్విజ్‌లో సాయి శ్రీనివాస విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం మండలం దావాజీగూడెంలోని ఎన్‌టిటిఎఫ్‌లో మంగళవారం జరిగిన క్విజ్ పోటీల్లో పెద అవుటపల్లి శ్రీ సాయి శ్రీనివాస పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి మొదటి స్థానంలో నిలిచారు. విజేతలకు ముఖ్యఅతిథి విజయరామరావు చేతుల మీదుగా బహుమతుల అందించారు. ఈ పోటీల్లో మొత్తం 16 టీములు పాల్గొన్నాయని ఎన్ టి టి ఎఫ్ ప్రిన్సిపాల్ మహీధర్ తెలిపారు. శ్రీ సాయి శ్రీనివాస , హైస్కూల్ విద్యార్థినులు ఎస్ కే మీను, జే హరిత మొదటి స్థానంలో నిలవగా , స్రవంతి హైస్కూలు , గన్నవరం విద్యార్థులు ఎస్‌విఎన్. ప్రకాష్ ,శైలజ, దుర్గ రెండో స్థానంలో నిలిచారు. గెలిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న కళాశాల ప్రతినిధులు

ఆర్:బికెలో అధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

రైతుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్

తుపాను పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎపి రైతుసంఘం నాయకులు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. బాపులపాడు మండలంలోని రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బికె)లను మంగళవారం సందర్శించారు. రైతులతో మాట్లాడి వారు పడుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. రైతు సంఘం నాయకులు తోట సాంబశివరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అబ్దుల్ భారీ, సి పిఎం కార్యదర్శి బేతా శ్రీనివాసరావు మాట్లాడుతూ తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలనీ, రైతులకు గోనె సంచులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కానుమోలు, తిప్పనగుంట గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. రైతులు తిరుమల శెట్టి సుబ్రహ్మణ్యం, తుమ్మల చంద్రశేఖర్ మాట్లాడుతూ తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు.

ఎంపిపి తనిఖీ

ప్రజాశక్తి-బంటుమిల్లి

బంటుమిల్లి మండలం ఆముదాలపల్లి పంచాయతీ పరిధిలోని జయపురంలోని ఎంపీయూపీ స్కూల్ ఎంపీపీ వెలివెల చినబాబు, వైస్ ఎంపీపీ ఓడిమి చిన్నారి బాబు సందర్శించారు.మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

క్రైస్తవులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ

శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో క్రీస్తు విశ్వాసులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని ఒకటో వార్డులో ఎస్టీ కాలనీలోని సర్వ కృపా నిధి ప్రధాన మందిరంలో సోమవారం రాత్రి గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ విలియం కేరి ఆధ్వర్యంలో కే.జాన్సన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో శ్యామ్ కిషోర్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 30 మంది సంఘస్తులకు దుప్పట్లు అందజేశారు.

మాజీ ఎంపి బాడిగ ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో 6,8, ఎనిమిదో తరగతులు చదువుతున్న విద్యార్థినిలు శోభిల

ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న సింహాద్దఇ రమేష్‌బాబు

లక్ష్మీ నెహ్రా శ్రీ శోభిల లక్ష్మీ మాన్యశ్రీ లకు వారి స్కూలు ఫీజు నిమిత్తం మచిలీపట్నం మాజీ పార్లమెంట్ సభ్యులు బాడిగ రామకృష్ణ వారి తల్లి తండ్రులు బాడిగ శేషగిరిరావు రామాయమ్మ మెమోరియల్ ట్రస్టు నుండి ఇద్దరికి రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ చెక్కులను మంగళవారం అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఇన్చార్జ్ కడవకల్లు నరసింహారావు చేతుల మీదుగా బాలికలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు జి.పణి, పి మధు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం : సింహాద్రి

ప్రజాశక్తి-కోడూరు

మాండూస్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తెలిపారు. కోడూరు మండలంలోని కోడూరు-కృష్ణాపురం గ్రామాల మధ్య భారీ వర్షాలు కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్ఆర్సిపి నేతలు, వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. వర్షాలు కారణంగా రంగు మారిన ధాన్యాన్ని, మొలకలు వచ్చిన ధాన్యాన్ని

మాట్లాడుతున్న సింహాద్రి రమేష్‌బాబు

కూడా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు ఎమ్మెల్యే రమేష్ బాబు రైతులకు హామీ ఇచ్చారు. డెల్టా ఆధునికరంలో కేటాయించిన కోట్ల రూపాయలు నిధులను అప్పటి పాలకులు దుర్వినియోగం చేయడం వల్లే నేడు డ్రైనేజీలు ఎగదట్టే పరిస్థితి నెలకొందనిఆరోపించారు. కొనుగోళ్ల కేంద్రం ద్వారా విక్రయించిన ధాన్యానికి సంబంధించిన నగదును కూడా పూర్తిగా రైతులు ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టం అంచనా వేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోడూరు జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, కోడూరు పిఎసిఎస్ అధ్యక్షులు పరిసే మాధవరావు, ఎంపీటీసీ సభ్యులు తిమ్మన వెంకట నాంచారయ్య, బడే గంగాధరరావు, కోడూరు గ్రామపంచాయతీ వైస్ ప్రెసిడెంట్ ఇంకొల్లు మురళీకృష్ణ, వైసిపి జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వెంకటనారాయణరావు, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్న ప్రసాద్ ,వైసీపీ సీనియర్ నాయకులు ముద్ధినేని చంద్రావు, కోట పద్మావతి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సోడాబత్తిన మెమోరియల్ గోల్డ్ మెడల్ ఏర్పాటుకు వినతి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

సోడాబత్తిన గోవింద్, సోడాబత్తిన గోపిమ్మ, సోడాబత్తిన సాంబశివ రామకృష్ణ ప్రసాద్, సోడాబత్తిన షణ్ముఖ సాయి రాజ్ జ్ఞాపకార్థం సోడా బత్తిన కుటుంబ సభ్యులు యూనివర్శిటీ బెస్ట్ అవుట్ గోయింగ్ ఎస్.సీ. స్టూడెంట్‌కి సోడా బత్తిన గోల్డ్ మెడల్ ఏర్పాటు చేయటానికి రూ.2.50 లక్షల విరాళాన్ని ప్రకటించారు.

చెక్కును స్వీకరిస్తున్న విసి కె.బిచంద్రశేఖర్

చెక్కును యూనివర్శిటీ వైస్ ఛాన్సిలర్ కె.బి.చంద్రశేఖర్‌కు మంగళవారం అందచేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన వైస్ ఛాన్సెలర్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ పరిశీలన కోసం ఈ అంశాన్ని పంపనున్నట్లు తెలిపారు.

నష్టపరిహారం చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-అవనిగడ్డ

మాండూస్ తుఫానుతో భారీ వర్షాల కారణంగా అవనిగడ్డ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో పంటలు నీట మునిగిన కారణంగా రైతులకు తక్షణమే ఎకరాకు రూ.30 వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆర్డీవో ఐ.కిషోర్‌కు వినతి పత్రం అందజేశారు. మంగళవారం సాయంత్రం అవనిగడ్డ తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆర్డీవోను టిడిపి నాయకులు కలిసి రైతుల సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు, బచ్చు రఘునాథ్, చెన్ను గాంధీ, బచ్చు మురళి, కొల్లూరి ఇమ్మానియేల్, మెరుగు సోమిరెడ్డి, కొల్లూరి వాసు, కొండవీటి చిన్న నాగులు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి : మాండూస్ తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎపి కౌలు రైతు సంఘం కృష్ణాజిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు ప్రభుత్వాన్ని కోరారు. మొవ్వ మండలంలో తుపాను ముంపునకు గురైన పంట పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత రైతులకు ఎకరానికి రూ.10వేలు పరిహారం అందించాలన్నారు. రెండో పంటగా సాగు చేసుకునేందుకు మినుము, పెసర విత్తనాలను రైతులకు ఉచితంగా ఇవ్వాలన్నారు. సిపిఎం మండల కార్యదర్శి సుబ్రహ్మణ్యం, నాయకులు గంగయ్య, వెంకటరత్నం, శ్రీనివాసులు, హరికృష్ణ, నాగేంద్రం, కేశవ తదితరులు ముంపుకు గురైన పొలాలను పరిశీలించారు.

గాయపడిన భవన నిర్మాణ కార్మికుడికి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అండ

ప్రజాశక్తి - విజయవాడ : మధురానగర్‌లో విద్యుత్ షాక్‌కు గురై ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న భవన నిర్మాణ కార్మికుడు రేపాక వెంకటరమణ భార్య భవానికి కృష్ణాజిల్లా బిల్డింగ్ (సిఐటియు) వర్కర్స్ యూనియన్ కృషి ఫలితంగా భవన యజమానితో మాట్లాడి రూ.60 వేల ఆర్థిక సహాయాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్.బాబురావు మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ సిటీ ప్రధాన కార్యదర్శి బి.గోవిందు, నాయకులు ఎం.బాబూరావు, ఎం.రాము, జి.గోవిందు, కుటుంబ సభ్యులు అంజి, రామకృష్ణ, ధనుంజయ్, సిపిఎం నాయకులు కృష్ణమూర్తి, కృష్ణ, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంగా జుజ్జూరు

వీరులపాడు శకం ముగిసింది

ప్రజాశక్తి - వీరులపాడు : 1987 నుండి మండల కేంద్రంగా ఉన్న వీరులపాడు ఇక రెవెన్యూ గ్రామంగానే కొనసాగనుంది. మంగళవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వీరులపాడు మండల కేంద్రాన్ని జుజ్జూరుకు మార్పు చేస్తూ తీర్మానించారు. 1987లో మండల వ్యవస్థ ప్రారంభమైనప్పుడు తొలుత జుజ్జూరును మండల కేంద్రంగా ప్రకటిస్తూ నాటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే వీరులపాడుకు చెందిన సిపిఐ నాయకుడు వట్టికొండ నాగేశ్వరావు (జగన్నాథం) ఆధ్వర్యాన అఖిలపక్ష కమిటీగా ఏర్పడి మండల కేంద్రాన్ని చారిత్రక ప్రాధాన్యత కలిగిన వీరులపాడులో ఏర్పాటు చేయాలని అప్పటి హోంమంత్రి వసంత నాగేశ్వరరావుపై వత్తిడి తీసుకొచ్చారు. అంతేగాక అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావును కలిసి విన్నవించారు. దీంతో వీరులపాడును మండల కేంద్రంగా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరులపాడు మండల కేంద్రం కోసం జరిగిన ఉద్యమంలో జగన్నాథంతోపాటు అఖిలపక్ష నేతలు అడ్డంకి సంగయ్య, వట్టికొండ పార్థసారధి, కోండ్రు పిచ్చేశ్వరావు, వాసిరెడ్డి పార్థసారధి, చావా శివాజీ తదితరులు కీలకపాత్ర పోషించారు. తాజాగా మండల కేంద్రం తరలిపోవటంతో వీరులపాడు ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు తమ చేజారిపోయిన మండల కేంద్రాన్ని మళ్లీ రప్పించుకొనేందుకు కొందరు ప్రముఖులు 2019లో రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రయత్నాలు ప్రారంభించారు. నందిగామ ఎంఎల్‌ఎ మొండితోక జగన్మోహనరావు, ఎంఎల్‌సి అరుణ్ కుమార్ ద్వారా ప్రయత్నించారు. ఎట్టకేలకు మంగళవారం మండల కేంద్రాన్ని జుజ్జూరుకు మార్పు చేస్తూ మంత్రివర్గ సమావేశంలో తీర్మానించడంతో వీరి చిరకాల వాంఛ నెరవేరినట్లయింది. జుజ్జూరు పరిసర గ్రామాల ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారు.

జుజ్జూరులో హర్షాతిరేకాలు

1985-86 ప్రాంతంలో రాష్ట్రంలో మండలాల వ్యవస్థ ఏర్పడిన సందర్భంగా జనాభా, విస్తీర్ణం ప్రాతిపదికన జుజ్జూరును మండల కేంద్రంగా ప్రకటించి, గెజిట్ నోటిఫికేషన్ కూడా ఇచ్చారు. అయితే ప్రకటన వెలువడిన తర్వాత పలు రాజకీయ కారణాలు, కుల సమీకరణలు, సామాజిక అంశాలతో మండల కేంద్రం విషయంలో మార్పు జరిగినట్లు జుజ్జూరు గ్రామస్తులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో గ్రామ పెద్దలు, పలువురు స్వాతంత్ర్య సమరయోధులు సైకిల్‌పై హైదరాబాద్ వెళ్లి పలు విన్నపాలు చేసినా పట్టించుకున్న నాథుడు లేకుండాపోయాడని అంటున్నారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్య మరింత జఠిలమైందని వాపోయారు. దీంతో గ్రామ అభివృద్ధి విషయంలో 37 ఏళ్ల వెనుకబాటుకు గురైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో తమకు న్యాయం జరిగిందని హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. జుజ్జూరును మండల కేంద్రంగా ఏర్పాటు చేసినందుకు కృషి చేసిన ఎంఎల్‌ఎ మొండితోక జగన్ మోహన్‌రావుకు, ఎంఎల్‌సి మొండితోక అరుణ్ కుమార్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. 7 వేల మందికిపైగా జనాభా ఉన్న గ్రామపంచాయతీని మండల కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అధికారులతో కలిసి కృషి చేస్తామని తెలిపారు. 1987లోనే జుజ్జూరు మండల కేంద్రంగా ఏర్పాటైందని, అయితే అప్పటి రాజకీయ సామాజిక పరిస్థితుల వల్ల వీరులపాడుకు తరలిపోయిందన్నారు. ఎప్పటి నుండో మండల కేంద్రం కావాలని కోరుతున్న ప్రజల కోరిక ఎట్టకేలకు నెరవేరిందని పేర్కొన్నారు. జుజ్జూరును మండల కేంద్రంగా ప్రకటించడం పట్ల వ్యవసాయ సహకార బ్యాంక్ ఛైర్మన్ పూల రాంబాబు హర్షం వ్యక్తం చేశారు. సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

మండల కేంద్రం తరలింపును ఆపకపోతే ఉద్యమం

వీరులపాడు మాజీ సర్పంచ్ వట్టికొండ చంద్రమోహన్

మండల కేంద్రం తరలింపును ఆపేయాలని సిపిఐ నాయకులు, గ్రామ మాజీ సర్పంచి వట్టికొండ చంద్రమోహన్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు గత ఎన్నికల్లో మొండితోక జగన్మోహనరావు గెలుపు కోసం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కలిసి కృషి చేశామన్నారు. అయితే జగన్మోహనరావు ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలు పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మండల కేంద్రం తరలింపు నిర్ణయాన్ని ఆపేయకపోతే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ఉద్యమిస్తామన్నారు. మండల కేంద్రాన్ని జుజ్జూరుకు మార్పు చేయడాన్ని విరమించుకోవాలని వీరులపాడుకు చెందిన ప్రకాశరావు కోరారు. 1987లో మండల కేంద్రంగా ఏర్పాటైనప్పటి నుండి ఇప్పటివరకు దాతల సహకారంతో అనేక భవనాలు నిర్మించారని గుర్తుచేశారు.

మహారాజ శ్రీ నందిగామ కృష్ణాజిల్లా 16వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
G.W.O.P.No.30/2022

Between:
దార్ల వెంకట భాను ప్రకాష్ ...పిటీషనర్
మరియు
నిల్ ...రెస్పాండెంట్

పై నెంబరు G.W.O.P.No.30/2022 పిటీషనర్ తాలుకు ఈ దిగువ షెడ్యూలు దాఖల ఆస్తిని మైనరు తరుపున అమ్మి వారి తరుపరి చదువుల నిమిత్తం ఖర్చు చేయుటకు అమ్ముకొనుటకు శ్రీ నందిగామ కృష్ణాజిల్లా 16వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో పిటీషన్ దాఖలు చేసి యున్నారు. సదరు దాఖలా ఆస్తిని అమ్ముటకు ఎవరికైన ఏవిధమైన అభ్యంతరం ఉన్నచో వారు ది.16-2-2022 తేది ఉదయం గం. 10.30 ని.లకు పైన తెలిపిన కోర్టు వారి ఎదుట మీరు కాని మీ తరుపున న్యాయవాది కాని హాజరై ఆక్షేపణలు తెలియజేసుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించెదరు. షెడ్యూలు ఆస్తి: కృష్ణాజిల్లా, కంచికచర్ల మండలం, కంచికచర్ల గ్రామ పంచాయతీ లిమిట్స్ డోర్ నెం.9/141 గల యింటికి ఆర్.ఎస్.నెం.366/5a హద్దులు : తూర్పు : 3.6 అడుగుల జాయింట్ పాసెజ్ దక్షిణం: దార్ల సోమశేఖర్ , భార్గవి మరియు మీకు అమ్మిన భూమి 36.4 పడమర : 3.6 అడుగుల జాయింట్ పాసెజ్ ఉత్తరం: ఉస్తేల వీర వెంకట నారాయణ గారి యింద్ల స్థలం
(కోర్టు వారి ఉత్తర్వులతో)
వాయిదా తేది:16-12-2022

మందా వజ్రయ్య,
పిటీషనర్ తరుపు న్యాయవాది, నందిగామ.

మొదటి పేజీ తరువాయి

వైసిపి కార్పొరేటర్ దందా

చేస్తున్నట్లు తెలిసింది. పలువురు బాధితులు తమకు జరిగిన అన్యాయంపై 'స్పందన' పోలీసు కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. బాధితుల ఒత్తిడితో కార్పొరేటర్ ఒకరిద్దరికి తిరిగి ఇచ్చిన బ్యాంక్ చెక్కులు బౌన్స్ అయినట్లు సమాచారం. బాధితుల నుంచి క్రమంగా వత్తిడి పెరిగిపోతుండటంతో కారు డ్రైవర్ చేసేది లేక తన యజమాని అయిన కార్పొరేటర్ వద్ద తన భయాన్ని, ఇబ్బందులను ఏకరవు పెట్టినట్లు సమాచారం. డబ్బులు తిరిగి ఇవ్వడంగానీ, ఉద్యోగాలు ఇప్పించడంగానీ ఏదో ఒకటి చేయకపోతే ఊరుకునేది లేదని బాధితులు వత్తిడి చేస్తున్నారని వాపోయినట్లు తెలిసింది. దీంతో ఆగ్రహించిన వైసిపి కార్పొరేటర్‌పాటు మరో పలువురు గాంధీనగర్లోని కార్పొరేటర్ కార్యాలయంలో కారు డ్రైవర్‌ను తీవ్రంగా కొట్టినట్లు తెలిసింది. అంతేగాక తమ పేర్లను ఎక్కడైనా బయట పెడితే చంపేస్తామని బెదిరించినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో కార్పొరేటర్ ప్రమేయం ఏమీలేనట్లు, వసూలు చేసిన డబ్బులకు తానే బాధ్యత వహిస్తున్నట్లు తెల్లపేపరుపై డ్రైవర్‌తో రాయించుకున్నట్లు తెలిసింది. కార్పొరేటర్ దాడి ఘటనలో డ్రైవర్‌కు గాయాలు కూడా అయినట్లు తెలిసింది. వారి నుంచి తప్పించుకున్న డ్రైవర్ రమేష్ వెంటనే తన తండ్రి సాయంతో సత్యనారాయణపురం పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. డబ్బుల వసూలులో కార్పొరేటర్ ప్రమేయం, దాడి ఘటనపై లిఖితపూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అయితే పోలీసులు బాధితుడి ఫిర్యాదు కాపీని పక్కన పెట్టి సదరు అధికారపార్టీ కార్పొరేటర్‌ను పిలిపించి రాజీ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈఘటనపై సత్యనారాయణపురం పోలీసులను ప్రజాశక్తి వివరణ కోరగా, కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్‌కు, ఆయన కారు డ్రైవర్‌రమేష్‌కు మధ్య వేతనంలో చోటుచేసుకున్న ఘర్షణలో గాయపడిన రమేష్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలిచ్చినట్లు తెలిపారు. ఉద్యోగాలిప్పిస్తామని డబ్బులు వసూలు చేసిన వ్యవహారం గురించి తమకేమీ తెలియదన్నారు. నిరుద్యోగుల నుండి డబ్బులు వసూలు చేయడం, డ్రైవర్‌ను కొట్టిన వ్యవహారాలపై సమగ్రంగా విచారించాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

ధాన్యం రవాణాలో అవస్థలు

ప్రారంభించారు. టెండర్ల ప్రక్రియ ద్వారా ప్రభుత్వమే వాహనాలు ఏర్పాటు చేస్తుందని అధికారులు ప్రకటించారు. కానీ అది పూర్తి స్థాయిలో కార్యరూపంలోకి రాకుండానే కొనుగోలు ప్రారంభించారు. దీంతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అందుబాటులో ఉన్న వాహనాలను ఒప్పంద ప్రాతిపదికన సమకూర్చుకోవాలని, రైతులు తమ సొంత వాహనాల్లో తరలించుకోవచ్చనని, వాహనాల వివరాలను పౌర సరఫరాల శాఖ డీఎం కార్యాలయానికి పంపాలని పేర్కొన్నారు.

వాహనాలేవీ?

కృష్ణాజిల్లాకు సంబంధించి ధాన్యం రవాణాకు వీలుగా మూడు రెవెన్యూ డివిజన్ల వారీగా టెండర్ల ప్రక్రియ ద్వారా గుత్తేదార్లను నియమించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 150 వరకు మిల్లులున్నాయి. ఈ లెక్కన రోజుకు 450 వరకు లారీల అవసరం ఉంటుందని అంచనా. కానీ గుత్తేదార్లకు సొంతగా అన్ని వాహనాలు సమకూర్చే సామర్థ్యం లేకపోవడం, కిరాయి తక్కువగా ఉందనే కారణంతో వాహనదారులు ధాన్యం రవాణాకు ముందుకు రాకపోవడంతో క్షేత్ర స్థాయిలో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. పైగా తేమ శాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేసే పరిస్థితి లేదు.

మిల్లుల్లో దిగుమతికి జాప్యం

గతంలో 10 టైర్ల లారీల్లో 25 టన్నులు, ట్రాలీల్లో 12 టన్నుల వరకు ధాన్యం రవాణా చేసేవారు. కానీ ప్రస్తుత విధానంలో సాంకేతిక కారణాలతో 10 టైర్ల లారీల్లో 20 టన్నులు, ట్రాలీల్లో 8 టన్నులు మాత్రమే అనుమతిస్తున్నారు. ఒకవేళ వాహనదారులు అధికలోడుతో వెళ్లినా సాఫ్ట్‌వేర్‌లో నమోదుకావడంలేదు. మరోవైపు కొందరు రైతులు సొంతగా ట్రాక్టర్లలో ధాన్యాన్ని తీసుకువెళుతున్నారు. అయితే నిబంధనల ప్రకారం ట్రాక్టరులో మూడు టన్నులు మాత్రమే అనుమతించడంతో రైతులు పూర్తిగా రవాణా చేయలేని పరిస్థితి నెలకొంది.

రవాణా అధికారులకు సంకటం

ధాన్యం రవాణాకు వీలుగా మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు రెవెన్యూ డివిజన్లకు సంబంధించి అధికారులు, గుత్తేదార్లతో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో ఆర్‌బికెల వారీగా అవసరమైన లారీలను సమకూర్చడం సదరు గుత్తేదార్ల బాధ్యత. కానీ తగిన లారీలు వారు అందుబాటులో ఉంచకపోవడంతో రవాణాశాఖ అధికారులపై ఉన్నతాధికారులు ఒత్తిడి పెంచుతున్నారు. యజమానులతో మాట్లాడి తగిన లారీలు అందుబాటులో ఉంచాలని తరచూ డిటిఓ, ఆర్‌టిఓ, ఎంవిఐలతో సమీక్షలు నిర్వహిస్తున్నారు.

షరతుల్లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

15 నుండి 17 వరకు ఉండాలంటున్నారని, అయితే తేమ శాతంతో సంబంధం లేకుండా తమ ధాన్యాన్ని కొని తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల సమస్యలు తెలుసుకున్న డివి.కృష్ణ ధాన్యం కొనుగోలుపై పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌తో మాట్లాడారు. కలెక్టర్ ఎస్.డిల్లీరావుకు ఫోన్లో రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. మార్కెట్ యార్డ్‌లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు డివి.కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా డివి.కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం చొరవ తీసుకుని తేమ శాతంతో సంబంధంలేకుండా ఆర్‌బికెల ద్వారా ధాన్యాన్నంతా కొనుగోలు చేయాలని కోరారు. తుపాను నేపథ్యంలో ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలూ పడుతున్నారని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం జగ్గయ్యపేట మండల, పట్టణ కార్యదర్శి సోమోజు నాగమణి, నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు, కంచర్ల కొండయ్య, కాకనబోయిన లింగారావు, షేక్ గౌస్ మియా, కోట కృష్ణ, ఎస్.రామనాథం, దంతాల వెంకటేశ్వర్లు, పలువురు రైతులు పాల్గొన్నారు.

మరో స్పా సెంటర్‌పై దాడులు

చెప్పారు. వ్యభిచారం నిర్వహించడానికి అక్కడ నిర్వాహకులు చేస్తున్నదంతా చూసి పోలీసులు షాక్ అయ్యారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన అమ్మాయిల ఫోటోలను చూపించి స్పెషల్ ప్యాకేజీ లు ఆఫర్ చేసి యువకులను ఆకర్షిస్తున్నట్లుగా గుర్తించారు.

IN THE HON'BLE COURT OF THE X ADDL. DISTRICT & SESSIONS JUDGE, AT: ANAKAPALLI
M.O.P. 211/2021

Between:
Smt. Dommesi Annapurna & others ...Petitioners
And:
Sri Vallepu Durga Rao & others ...Respondents

NOTICE

To,
D-1: Sri Vallepu Durga Rao,
S/o. Late Venkateswara Rao, Hindu, aged 40 years, Driver of Lorry Bearing No. AP 07 TH 4519, R/at D.No.1-3/4-104, Erukula Vari Street, Vidyadharapuram, Vijayawada Urban, Krishna (Dist) Pin-520012.

Please take notice that the above named petitioners herein has filed the above M.O.P.211/2021 against you and other respondents claiming compensation and the matter stands posted to **04-01-2023** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **04-01-2023** at **10:30 A.M.** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

G. GOVINDA REDDY, Advocate
Visakhapatnam.
Cell: 9440557424.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : NANDIGAMA
O.S.NO.378/2014

Between:
Noor Unnisa & Others ...Plaintiff.
And
Shaik Bademiya & Others ...Defendant.

To
4.Shaik Khumeer Miya, s/o. Hussain Miya, Muslim, Properties, Residing at Pendyala, Kanchikacherla Mandal, NTR District, Within The Jurisdiction of This Honourable Court.
5. Shaik Niyamath bee, W/o.Bade Miya , Muslim, House Wife, Resident of at Pendyala, Kanchikacherla Mandal, NTR district, Within The Jurisdiction of This Honourable Court.

వాదులు షేక్ అప్పాబీబీ గారి వారసులమని అప్పాబీబీ గారు ఆస్తులు పంపిణీ నిమిత్తం మీ పై పైన తెలిపిన కోర్టు లో దావా దాఖలు చేసినారు. అందులో మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు ది.15.12.2022కు వాయిదా యిచ్చి యున్నారు. ఆ రోజు ఉదయం గం.10.30.ని.లకు మీరు హాజరు అయి ఆక్షేపణలున్న పై కోర్టు లో తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమున పై దావా ,పిటీషనును తీర్మానించెదరు.

T.V.V.S.Sarma,
Advocate, Nandigama

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT:GANNAVARAM
I.A.349/2022, I.A.350/2022, I.A.351/2022 in O.S.193/2019

Between:
Bandaru Vijaya Raju. ...Plaintiff/Petitioner
And
Bandaru Yesamma & Others ...Defendants/Respondents

To,
Respondent No.6: గొంది రామారావు, S/o.సత్యనారాయణ(లేటు), ముస్తాబాద గ్రామము, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా.
Respondent No.8: బండారు వెంకటేశ్వరరావు, S/o.సోమయ్య(లేటు), D.No.2-58-1, ముస్తాబాద గ్రామము, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా.
Respondent No.9: బండారు ఆదెమ్మ, D/o.సోమయ్య(లేటు), D.No.2-58-1, ముస్తాబాద గ్రామము, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా.
Defendent No.8: బండారు వెంకటేశ్వరరావు, S/o.సోమయ్య(లేటు), D.No.2-58-1, ముస్తాబాద గ్రామము, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా.
Defendent No.10: బండారు శ్రీనివాసరావు, S/o.సోమయ్య(లేటు), D.No.2-58-1, ముస్తాబాద గ్రామము, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా.

పై నంబరు దావానందు గల I.A.349/2022, I.A.350/2022, I.A.351/2022 లలో మీరు R6, R8, R9 గాను పిటీషన్ నందు D8, D10 ప్రతివాదులుగా ఉండి ఎన్నిసార్లు సమన్లు పంపిన తీసుకొనని కారణంగా గన్నవరం సీనియర్ సివిల్ జడ్జి వారు ఈ పేపరు పబ్లికేషన్ కు ఆర్డరు ఇచ్చియున్నారు. ది.16-12-2022 వ తేదీన ఉదయం 10-30 గంటలకు మీరు స్వయముగా కానీ , అడ్వకేటు గారి ద్వారా కానీ హాజరై ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

పరగటి రవీంద్ర బాబు,
వల్లభనేని నాగ పవన్ కుమార్,
వాది తరుపు న్యాయవాదులు,
D.No.11-77, Old Bazar, Ring Center, Ibrahimpatnam, Vijayawada, Pin-521456, NTR District.
Cell No.93933 63999, 99481 94327

రూ.10 వేల నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-చల్లపల్లి

మాండూస్ తుఫానుతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని రైతు, కౌలు రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని

కాల్వలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

చింతలమడ గ్రామంలో రైతులతో కలిసి మండూస్ తుపాన్ వల్ల తడిసి ముద్దయిన వరి పొలాలను ఆదివారం పరిశీలించారు. ఎకరానికి రూ.10వేలు నష్ట పరిహారం ఇవ్వాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు, జిల్లా కౌలు రైతు సంఘం నాయకులు వాకా రామచంద్రరావు డిమాండ్‌చేశారు. తుఫాను వల్ల రైతుల తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలను సడలించి తడసిన, రంగుమారిన, మొలకెత్తిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారు కోటేశ్వరరావు, గోళ్ళ సాంబశివరావు, రైతులు సుదాని శివ నాగ సుబ్రహ్మణ్యం, అర్జునరావు, సత్యనారాయణ, వెంకట్రావు, నాంచారయ్య, పాండురంగారావు, ఏడుకొండలు, యేసుపాదం, ఉమామహేశ్వరావు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

అగినపర్రు పాఠశాలకు ప్రథమ బహుమతి

ప్రజాశక్తి-పమిడిముక్కల

మండల కేంద్రమైన పమిడిముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సైన్స్ ఎగ్జిబిషన్ విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లు ఆలోచింపజేశాయి. అగినపర్రు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతిని పొందారని ఆ పాఠశాల

ప్రధానోపాధ్యాయురాలు స్వరాజ్యలక్ష్మి తెలిపారు. పర్యావరణం పరిరక్షణ, భూమిని ఎలా కాపాడుకోవాలి అనే అంశంపై ప్రదర్శించిన నమూనాతో ఉత్తమ బహుమతి పొందారు. ఈ కార్యక్రమంలో పమిడిముక్కల ఎంఇఒ శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు రమేష్; పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండలి వెంకట్రామ్ పరామర్శ

ప్రజాశక్తి-చల్లపల్లి

కొత్తమాజేరు మాజీ సర్పంచ్, రైతు నాయకులు యార్లగడ్డ శివరామ ప్రసాద్(శివరాం)ను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ మంగళవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను ఆయన రాజాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మోర్ల రాంబాబు, పైడిపాముల కష్ణకుమారి, యార్లగడ్డ శ్రీనివాసరావు, రావి చిట్టి, షేక్ నభీ ఘోరి, తుమ్మలగుంట గోపాలకష్ణ తదితరులు పాల్గొన్నారు. చల్లపల్లి మండలం పాత మాజేరుకు చెందిన నిరుపేద వ్యవసాయ కూలీ, టీడీపీ కార్యకర్త వీరంకి నాగరాజుకు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ సాయం అందించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నాగరాజును పరామర్శించి ధైర్యం చెప్పారు. రాజా వెంట టీడీపీ నేతలు మోర్ల రాంబాబు, పైడిపాముల కష్ణకుమారి, యార్లగడ్డ శ్రీనివాసరావు, రావి చిట్టి, తుమ్మలగుంట గోపాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరిహారం అందించాలి

ప్రజాశక్తి-చల్లపల్లి

అవనిగడ్డ నియోజకవర్గం లక్ష్మీపురం పంచాయతీ శివారు చింతలమడ గ్రామానికి చెందిన దళితులు రోడ్డు ప్రమాదంలో మృతి చెంది ఆరు నెలలైనా నేటికీ సాయం అందించకపోవడం దారుణమని సిపిఎం నాయకులు ప్రభుత్వం డిమాండ్‌చేశారు. స్థానిక గుంటూరు బాపనయ్య శ్రామిక భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు వాకా రామచంద్రరావు, చల్లపల్లి మండల కార్యదర్శి యద్ధనపూడి మధు, బండారు కోటేశ్వరరావు, మహమ్మద్ కరీముల్లా మాట్లాడారు. కృత్తివెన్ను మండలం నీలిపూడికి చెందిన అయ్యప్ప భక్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ప్రభుత్వం స్పందించి మృతుల కుటుంబాలకు రూ.ఐదు లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించటంపై హర్షాన్ని వ్యక్తంచేశారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామంత్రి జోగి రమేష్ రాష్ట్రానికి మంత్రి కానీ ఒక్క నియోజకవర్గానికి కాదని మాత్రంకాదని పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, బాధ్యతగల అధికారులకు చింతలమడ గ్రామస్తులు ఎన్ని మార్లు విన్నవించుకున్న స్పందించకపోవడంపై నాయకులు మండిపడ్డారు. మోపిదేవి మండలం కాసా నగర వద్ద ఏప్రిల్ 26వ తేదీన చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు చింతలమడకు చెందిన పెళ్లి బృందం వ్యాన్ ప్రమాదానికి గురైందని పేర్కొన్నారు. మృతులంతా రెక్కాడితేగాని డొక్కాడని పేదలైన దళితులుగా పేర్కొన్నారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదంలో ఎక్కడ మృతి చెందిన ఆర్థిక సహాయం అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం చింతలపూడి దళితులకు ఎందుకు సాయం అందించడం లేదని ప్రశ్నించారు.

ఎలాంటి ఆంక్షల్లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

వరి కంకులను పరిశీలిస్తున్న శీలం నారాయణరావు

ప్రజాశక్తి-మొవ్వ

తుపాన్‌తో నీట మునిగి దెబ్బతిన్న వరి ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా రాష్ట్రప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని ఎపి కౌలు రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. మొవ్వ మండలంలోని పలు గ్రామాల్లో తడిచిన వరి పనలను మంగళవారంనాడు కౌలు రైతుసంఘం ప్రతినిధి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ తుఫాను వల్ల మొలకలు వచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏ విధమైన ఆంక్షలు లేకుండా వెంటనే సేకరించాలన్నారు. తుఫానుతో మొవ్వ మండలంలో వందలాది ఎకరాల్లో వరి పండించిన రైతులు అప్పుల పాలయ్యారన్నారు. యుద్ధ ప్రతిపదికన నష్టం అంచనాలను సేకరించారనీ, ఎకరానికి రూ.10వేలు చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. సబ్సిడీ పై మినుములు, పెసల విత్తనాలు సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సుబ్రహ్మణ్యం, రైతులు వెంకటరత్నం, గంగయ్య, శ్రీనివాసరావు, హరికృష్ణ, నాగేంద్రం, కేశవ పాల్గొన్నారు.

ఆశాజ్యోతిలో అన్నదానం

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్

శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టి హరి కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో రాష్ట్ర యువజన అధ్యక్షులు నాలి బాలాజీ యాదవ్ పుట్టినరోజును పురస్కరించుకుని హనుమాన్ జంక్షన్‌లోని ఆశాజ్యోతి వికలాంగుల ఆశ్రమంలో 65 మంది విద్యార్థిని విద్యార్థులకు అన్నదానం చేశారు. పండ్లు కూడా పంపిణీచేశారు. బాపులపాడు ఎంపీపీ ఎర్రగొల్ల నగేష్ యాదవ్ అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ జిల్లా జాయింట్ సెక్రటరీ గాదె మోహన్ బాబు, నూజివీడు యాదవ సంఘం అధ్యక్షులు కొలుసు రవికుమార్, దేవస్థాన సభ్యులు కంతేటి హరిబాబు, గన్నవరం నియోజకవర్గ యూత్ అధ్యక్షులు సాకిరి రామ్మోహన్ యాదవ్, మాగంటి వాసు, పెదమల్లు గోపాలకృష్ణ, హనుమాన్ జంక్షన్ యాదవ్ యూత్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ దేవాలయ ప్రథమ వార్షికోత్సవం

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్

బాపులపాడు మండలం రంగన్నగూడెం గ్రామంలోని శ్రీకృష్ణ దేవాలయ మొదటి వార్షికోత్సవం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు పుసులూరు లక్ష్మీనారాయణ, లక్ష్మీ నర్సులు దంపతులు, కసుకుర్తి వెంకట శాస్త్రులు,పద్మావతి దంపతులు, కసుకుర్తి కష్ణారావు, పద్మావతి దంపతులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు, మాజీ సర్పంచ్ మణికృష్ణ దంపతులు, గ్రామ సర్పంచ్ కసుకుర్తి రంగా మణి, అర్జునరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొలుసు బలరాం, కొలుసు రాంబాబు, కాట్రు పాపారావు, కొలుసు గోపిరాజు, కోలుసు శ్రీమన్నారాయణ, గొరిపర్తి రాంబాబు, కొలుసు గంగాజలం తదితరులు పాల్గొన్నారు.

15న విద్యుత్ ఆదాలత్ : ఎఇ

గుడివాడ : విద్యుత్ సరఫరాలో తరుచుగా వచ్చే అంతరాయాలు, విద్యుత్ మీటర్ల సమస్యలు, విద్యుత్ బిల్లుల సమస్యలపై ఈ నెల 15న గుడివాడలోని స్లేదర్‌పేటలోని జివిఆర్ కళ్యాణ మండపంలో జరిగే విద్యుత్ ఆదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు టి.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ జరుగుతుందని పేర్కొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : పోలినాయుడు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

మోటారు రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చెయ్యాలని ఆటో అండ్ ప్రయివేటు మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి ఎం.పోలినాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 18, 19వ తేదీల్లో గన్నవరంలో జరిగే సిఐటియు కృష్ణాజిల్లా 11వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యూనియన్ అధ్యక్షులు గుడిమెళ్ళ నాగరాజు అధ్యక్షతన మచిలీపట్నంలోని జోతిరావుపూలే విజ్ఞానకేంద్రంలో మంగళవారం యూనియన్ సమావేశం జరిగింది. రవాణారంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ మహాసభల ద్వారా ప్రభుత్వ దష్టికి తీసుకువెళతామన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మత్రాపు పోలినాయుడు మాట్లాడుతూ రోజురోజుకీ పెరుగుతున్న వాహన ఇన్సూరెన్స్ ధరలను అదుపు చేయాలన్నారు. పోలీసుల వేధింపులను ఆపాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో పెట్రోలు, డీజిల్ ధరలు, ఇన్సూరెన్స్, ఇతర పన్నుల చెల్లింపు భారంగా మారిందని, ప్రయివేటు రవాణా రంగం కుదేలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోలు, డీజిల్ ఉత్పత్తులను జిఎస్టీ పరిధిలోకి తీసుకు వస్తే వాటి ధరలు తగ్గి ప్రయివేటు మోటారు రవాణా రంగానికి మేలు జరుగుతుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు అధిక లాభాలు చేకూర్చే విధంగా రవాణా రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులను వారి కుటుంబాలను రోడ్డుపైన పడేసే విధంగా ప్రభుత్వాలు చట్టాలు చేస్తున్నాయిన్నారు. ఆటో రవాణా రంగ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని పలుమార్లు మొరపెట్టిన చెవిటివాని ముందు శంఖం ఊదిన చందంగా మారిందన్నారు. ఇన్సూరెన్స్ రంగం ప్రైవేట్ పరం కాకుండా ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ట్రాన్స్పోర్ట్ యూనియన్ నాయకులు చండిక రాంబాబు, ఆటో యూనియన్ నాయకులు కె వెంకటేశ్వరరావు, కె శ్రీనివాసరావు,కె గంగాధర్ రావు, ఎస్ కె బాజీ, కె ఆనంద్ కుమార్, కె సాంబశివరావు, హైర్ బస్ యూనియన్ నాయకులు బి రామ్మోహన్ రావు, ఎ సత్యనారాయణ, మచిలీపట్నం పట్టణ సిఐటియు కార్యదర్శి సిహెచ్ జయరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యావైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-కోడూరు

మండలంలోని స్వతంత్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోడూరు మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను కోడూరు జెడ్పీటీసీ సభ్యులు యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ ప్రారంభించారు. మండలంలోని ఉన్నత పాఠశాలలో జడ్పీ హైస్కూల్ స్వతంత్రపురం, జడ్పీ హైస్కూల్ సాలెంపాలెం, జడ్పీ

ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ

హైస్కూల్ బడేవారిపాలెం, జడ్పీ హైస్కూల్ లింగారెడ్డి పాలెం, జడ్పీ హైస్కూల్ కొత్తపాలెం విద్యార్థులు ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు తిమ్మన నాంచారయ్య, పిఎంసి చైర్మన్ గల్లా శ్రీనివాసరావు పంచాయతీ వార్డు సభ్యులు అర్జునరావు పాల్గొని విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిషన్‌ను పరిశీలించి అభినందించారు. ఈకార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆల వెంకట రమణ, మండల విద్యాశాఖ అధికారి టీవీఎం రాందాస్, మండల సైన్స్ కోఆర్డినేటర్, బి.ఉదయభాస్కర్, సీనియర్ సైన్స్ ఉపాధ్యాయులు ఎ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు నాగాయలంక మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి-నాగాయలంక

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఏర్పాటుచేసినట్లు నాగాయలంక ఎంపీడీవో వి. శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ బోగాది రాఘవరాణి అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే ఈ సమావేశంలో 21 శాఖల పనితీరుపై సమీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. సంబంధిత మండల స్థాయి అధికారులు. ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

స్పాట్ ఫొటోగ్రఫీలో సత్తా చాటిన రాజేష్

ప్రజాశక్తి-వన్‌టౌన్: కృష్ణా విశ్వవిద్యాలయం కృష్ణాతరంగ్ -2022 పేరుతో నిర్వహించిన అంతర్ కళాశాలల యువజనోత్సవాల్లో నగరంలోని కేబీఎన్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న వేముల రాజేష్ కళాశాల పక్షాన స్పాట్ ఫోటోగ్రఫీ అంశంలో పోటీ చేసి మొదటి బహుమతిని సాధించాడు. ఈ బహుమతిని సాధించిన రాజేష్‌ను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు. మొదటి నుంచీ ఫోటోగ్రఫీ పట్ల ఎంతో ఆసక్తిని చూపించే రాజేష్ ఈ బహుమతిని గెల్చుకోవడం అభినందనీయమని పలువురు ఫోటోగ్రాఫర్లు అభినందించారు. రాజేష్ తండ్రి వేముల వెంకట్రావు కూడా మంచి ఫోటోగ్రాఫర్‌గా గుర్తింపు సాధించారు.

శైలజ థియేటర్‌లో 'త్రీ' డీ స్క్రీన్ ఏర్పాటు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఈ నెల 16వ తేదీన విడుదల కానున్న అవతార్-2 సినిమా 'త్రీ' డీలో ప్రేక్షకులకు కనువిందు చేసేందుకు గాంధీనగర్‌లోని శైలజ థియేటర్‌లో ప్రత్యేకంగా త్రీడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేసినట్లు థియేటర్ మేనేజర్ బాబి తెలిపారు. మంగళవారం త్రీడీ స్క్రీన్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముంబయి నుండి ప్రత్యేకంగా తయారు చేయించి నిపుణుల పర్యవేక్షణలో థియేటర్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్రీడీ స్క్రీన్ మూడు జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా తమ థియేటర్‌లో ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం ఉన్న 2.6 గైన్ నుండి 3.8 గైన్ స్క్రీన్‌గా అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపారు. ప్రతిరోజూ ఐదు షోలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. త్రీడీ సినిమా విడుదల సందర్భంగా అవతార్ వేషధారణలో అవతార్ ఫ్యాన్ రాజేష్‌చే ఏర్పాటు చేసిన వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పాడి రైతులకు బోనస్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-వన్‌టౌన్: పాడిరైతుల అభ్యున్నతికి తాము కృషిచేస్తున్నట్లు కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు చెప్పారు. మంగళవారం మిల్క్ ఫ్యాక్టరీ ఆవరణలోని పాలఉత్పత్తిదారుల సమావేశ మందిరంలో మైలవరం క్లస్టర్ పరిధిలో 110 పాల సంఘాలకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి బోనస్ రూ.1.40 కోట్ల విలువైన చెక్కులను సంబంధిత పాల సంఘాల అధ్యక్షులకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022-2023 ఆర్థిక సంవత్సరానికి రెండో విడత (ఆగష్టు నుండి నవంబర్ వరకు) బోనస్ కింద సమితి రూ.19 కోట్లను పాడి రైతులకు చెల్లిస్తుందని తెలిపారు. యూనియస్ వివిధ పాడి రైతు మరియు పశుసంక్షేమ కార్యక్రమాలు ఫలితంగా 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుండి నవంబర్ మాసములకు 4.6 కోట్ల లీటర్ల పాల సేకరణ చేయగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో 6.08 కోట్ల లీటర్ల పాల సేకరణ చేశామని, ఇది 32 శాతం వద్ధి అని వివరించారు. కురియన్ నిర్దేశాలకు అనుగుణంగా వినియోగదారుడి దగ్గర తీసుకున్న ప్రతి రూపాయిలో నేరుగా 80 శాతంకి పైబడి తిరిగి రైతులకు చెల్లిస్తున్న ఏకైక సహకార సంస్థ అన్నారు. 2022-2023 ఆర్థిక సంవత్సరంలో రూ.1150 కోట్లు టర్నోవర్ లక్ష్యంగా సమితి కషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు, జిల్లా పాలకవర్గ సభ్యులు ఉయ్యూరు అంజిరెడ్డి, పల్లగాని కొండలరావు, ఫీడ్ కమిటీ సభ్యులు యు.నాగరాజు, జనరల్ మేనేజర్ పిఅండ్ఐ జి.అనిల్ కుమార్, మైలవరం క్లస్టర్ మేనేజర్ కె.ప్రసాద్ పాల్గొన్నారు.

యువత క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలి

జోన్-2 క్రీడా సంబరాల ప్రారంభోత్సవంలో కలెక్టర్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: యువతలో క్రీడా స్ఫూర్తిని నింపి అంతర్జాతీయ క్రీడా కారులుగా తీర్చిదిద్దేందుకు జగనన్న క్రీడా సంబరాలను నిర్వహించి ప్రతిభ కనపరిచిన క్రీడాకారులకు నగదు ప్రోత్సహకాలను అందిస్తుందని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. జగనన్న క్రీడా సంబరాలలో భాగంగా జోన్-2 పరిధిలోని క్రీడాకారులకు స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న జోనల్ లెవల్ క్రీడా పోటీలను మంగళవారం శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రీడలలో రాణించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చిన క్రీడాకారులలో ఎక్కువ మంది ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన వారు కావడం గర్వించదగిన విషయమన్నారు. క్రీడాకారులలో దాగివున్న ప్రతిభను వెలికతీసి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం క్రీడా రంగాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. జోన్-2 పరిధిలోని తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కాకినాడ, కోనసీమ, ఏలూరు, కృష్ణా ఎన్‌టిఆర్ జిల్లాల కబడ్డీ క్రీడాకారులకు మహిళా పురుషుల విభాగంలో కబడ్డీ పోటీలను ఎన్‌టిఆర్ జిల్లాలో నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర క్రీడా ప్రాధికారి సంస్థ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు జీవితంలో భాగంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించి ప్రత్యేక నిధులను కేటాయిస్తుందన్నారు. దీనిలో భాగంగా గ్రామ స్థాయిలో జగనన్న స్పోర్ట్స్ క్లబ్బులు, ప్రతి క్రీడకు ఒక సంక్షేమ సంఘం ఏర్పాటు చేశామన్నారు. తొలుత జిల్లా కలెక్టర్, నగర మేయర్, శాసనసభ్యులు క్రీడాకారులతో కలిసి కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక శాసనసభ్యులు మల్లాది విష్ణువర్ధన్, స్థానిక కార్పొరేటర్ కె.అనిత, డిఎస్ఎ సిఇవో యు శ్రీనివాసరావు, ఛీఫ్ కోచ్ ఎస్ఏ అజీజ్ పాల్గొన్నారు.

నీటి మీటర్లకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు

ప్రజాసమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-విజయవాడ: అవినీతిలో పీకల్లోతు కూరుకుపోయిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు వివిధ రూపాల్లో ప్రజలపై భారాలు మోపుతూ ప్రజాసమస్యలను గాలికొదిలేశారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు విమర్శించారు. మధురానగర్ ఇందిరా కాలనీలో సిపిఎం నాయకులు మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధురానగర్ రైల్వే అండర్ బ్రిడ్జి పనులు మూడేళ్లుగా నిలిచిపోవడంతో సరైన రహదారి లేక గంటల తరబడి ట్రాఫిక్ స్తంభిస్తుందని ప్రజలు తెలిపారు. వేల సంఖ్యలో ఖాతాదారులు, వందల సంఖ్యలో పొదుపు గ్రూపులు ఉన్న ఆంధ్రా బ్యాంక్ మధురానగర్ బ్రాంచ్ మూసివేయటానికి నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ విజయవాడలో నీటి మీటర్లు బిగించేందుకు రూ.100 కోట్లు ఖర్చు పెట్టడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కానీ ఏళ్ల తరబడి ఆగిపోయిన అండర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు ఇవ్వడం లేదని విమర్శించారు. పసుపు తోటలో నీటి మీటర్లు పెట్టడంతో అద్దెకు ఉన్న వారి మీద ఈ భారం పడే ప్రమాదం ఉండటంతో అద్దెకు ఉన్నవారు తరలిపోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. నీటి మీటర్ల ఏర్పాటును నిలిపివేయ్యకపోతే ప్రజలను కలుపుకొని ఐక్య ఉద్యమాన్ని నడపడంతో పాటు ఈ ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.కష్ణమూర్తి, కష్ణ, చిన్నా, ఎం.బాబురావు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో ఆరు శతాబ్దాల ఆలయం

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: విజయవాడ నగరానికి కూతవేటు దూరంలో గల కొత్తూరు కొండపైన నానాటికీ శిథిలమవుతున్న ఆరు శతాబ్ధాల ఇటుక రాతి ఆలయాన్ని కాపాడుకోవకాలని పురావస్తు పరిశోధకుడు ప్లీచ్ ఇండియా ఫౌండేషణ్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడిక్డ అన్నారు. మొగల్‌రాజపురంలోని మధు మాలక్ష్మీ కాంప్లెక్స్‌లో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తూరు గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు మేడసాని శుభాకర్, సాహితీవేత్త డాక్టర్ గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమి అధినే గోళ్ల నారాయణరావుతో కలసి పురాతన కట్టడాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఆలయం పూర్తిగా ఇటుకరాతితో నిర్మించి, సున్నపుగారతో తాపడం చేశారన్నారు. ఆలయ గోడలపై రావిచెట్టు పెరిగి గోడలు, శిఖరం బీటలు పారాయని అన్నారు. కొండవీటి రెడ్డిరాజులు ఆలయాన్ని నిర్మించారని అతి పురాతనమైనదని దీనికి కాపాడుకోవాల్సిన అవశ్యత ఉందని తెలిపారు. ఆలయ పరిసరాలను బాగుచేస్తే పచ్చదనం, ప్రకృతి ఒడితో పాటు చుట్టూ మామిడి తోటలతో విజయవాడ నగర వాసులకు ఒక వారసత్వ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు.

రీసెర్చి ఇనిస్టిట్యూట్‌కు ఆర్థిక సహకారం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: భండార్కర్ ఓరియెంటల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు మూర్తి ట్రస్టు పరిశోధనకు సహకారం అందించనున్నట్లు ట్రస్టు నిర్వాహఖులు వి.ఎస్.రావు ఒక ప్రకటనలో తెలిపారు. మూర్తి ట్రస్టు, సుధామూర్తి, నారాయణమూర్తిల కుటుంబ ఫౌండేషన్‌లు అరుదైన పుస్తకాలు, రాత పత్రులను కాపాడటం కోసం, పరిశోధనలు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తగిన విధంగా ఆర్థిక సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే 75 మిలియన్ల రూపాయలను భండార్కర్ ఓరియెంటల్ సంస్థలకు పరిశోధనలకు అందించినట్లు తెలిపారు. రానున్న కాలంలో మరిన్ని సంస్థలలో తగిన విధంగా తాము ప్రోత్సాహం అందించనున్నట్లు తెలిపారు.

23 నుండి హై లైఫ్ బ్రైడ్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: వివాహ ఫ్యాషన్ అవసరాలను తీర్చేందకుగాను ఈ నెల 23వ తేదీ నుండి నగరంలోని హొటల్ నోవాటెల్ నందు హై లైఫ్ బ్రైడ్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహఖులు పి.డొమినిక్ తెలిపారు. బుధవారం ఉదయం రింగురోడ్డు వద్ద గల హొటల్ నోవాటెల్ నందు ఎగ్జిబిషన్ సందర్భంగా మోడల్స్‌తో ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వివాహాల సందర్భంగా ఎక్కువ మంది వివాహ వస్త్రాకలు సంబంధించి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థిత ఉంటుందన్నారు. అయితే వివాహ వస్త్రాలన్ని ఒకేచోట అందించాలనే ఉద్దేశంలో హై లైఫ్ బ్రైడ్స్ ప్రదర్శన ఈ నెల 23 నుండి 25వ తేదీ వరకు నగరంలోని హొటల్ నోవాటెల్ నందు ఉదయం 10 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈప్రదర్శనలో వెడ్డింగ్ ఫ్యాషన్స్, జ్యువెలరీ, బ్రైడల్ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఉత్పత్తులతో పాటు డిజైనర్స్, చీరలు, ప్రముఖ ఫ్యాషన్ వస్త్రాల వారు స్టాల్స్‌ను ఏర్పాటుచేస్తారన్నారు. రెండు రోజల పాటు జరిగే ఈప్రదర్శనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రదర్శనలో ప్రముఖ నటి కామాక్షి భాస్కర్ల, టాప్ మోడల్స్ పాల్గొన్నారు.

ఆట్యా పాట్యా పోటీలకు క్రైస్ట్ ది కింగ్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఈ నెల 16 నుండి 19వ తేదీ వరకు ఛత్తీస్‌ఘడ్‌లో జరుగనున్న జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఆట్యా పాట్యా పోటీలకు నగరంలోని క్రైస్ట్ ది కింగ్ ఇంగ్లీషు మీడియం విద్యార్థులు రాష్ట్ర జట్టు తరపున పాల్గొననున్నారని స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జాస్పిన్, ఉప ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ పుష్ప తెలిపారు. క్రీస్తురాజపురంలోని క్రైస్ట్ ది కింగ్ ఇంగ్లీషు మీడియం స్కూల్ నందు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు మంగళవారం అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఆట్యా పోటీలలో తమ విద్యార్థులు ప్రతిభ కనపరచి పతకాలు సాధించడంతో జాతీయ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఆట్యా పాట్యాతో పాటు వివిధ క్రీడల్లో కూడా తమ విద్యార్థులు ప్రతిభ కనపరుస్తున్నారని తెలిపారు. వీరితో పాటు హర్యానాలో జరుగనున్న నెట్‌బాల్ సబ్ జూనియర్స్ జాతీయ స్థాయి పోటీలకు కూడా తమ విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారని తెలిపారు. ఆట్యా పాట్యా పోటీలకు తమ పాఠశాల నుండి బాలుర విభాగంలో ఎన్.రాకేష్, శ్రీనాథ్, ఎం.దినేష్, బి.మణికంఠ, ఎస్.సాయి సందీప్ ఎంపికవ్వగా బాలికల విభాగంలో ఎ.సోనాలిక, కె.హర్షిత, కె. వర్షిత, కె.హేమంత్, పి.దుర్గాభవానీ, కె.హాసిని ఎంపికయ్యారని తెలిపారు. నెట్‌బాల్ పోటీలకు సంబంధించి బి.హర్షిణి, కె.నితిత్ కుమార్ ఎంపికయ్యారన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.